నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
గురువారం | 27 మార్చి 2025 | www.navatelangana.com

ఫాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారరణ జరిపించాలి



నవతెలంగాణ-వట్‌పల్లి : ఫాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర న్యాయవిచారణ జరి పించాలని అందోల్ నియోజకవర్గం జీసస్ ఫాస్టర్స్ ఫెలో షిప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం అల్లాదుర్గం మండలంలోని చేవెళ్లలో ఫాస్టర్‌ఫెలోషిప్ ఆధ ర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అసత్యానికి అడ్డుకట్ట వేస్తూ.. క్రీస్తు సత్యాన్ని చాటి చెప్పేందుకు ముందుకు వస్తున్న వ్యక్తిని పథకం ప్రకా రమే హత్య చేశారని ఆరోపించారు. ప్రమాదం జరిగిన స్థలా న్ని పరిశీలిస్తే..అది కచ్చితంగా హత్యాలాగే ఉం దన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ సమగ్రంగా జరిపించకపోతే క్రైస్తవ సం ఘాలన్నీ ఆందోళన బాట పడుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ నియోజకవర్గం ఫాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షు లు స్టీఫెన్, ప్రధాన కార్యదర్శి కే.డేవిడ్, సలహాదారుకే సమ ర్పికమిటీ సభ్యులు సోలోమోన్ తదితరులు పాల్గొన్నారు.

జాన్ వెస్లీ అక్రమ అరెస్టు పట్ల ఖండన



సీపీఎం జిల్లా కార్యదర్శి జి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అక్రమంగా అరెస్టు చేయడం పట్ల సీపీఎం జిల్లా సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి జయరాజు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను, రోడ్లను, 350 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ఇవ్వాలని పోరాడుతున్న పేదలకు అండగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. పేదల ఇండ్ల స్థలాల కోసం ఇచ్చిన భూమిలో వారికి ఇవ్వాలని అడగడం నేరమా అంటూ పేద ప్రజల కోసం పోరాడుతుంటే అరెస్టు చేస్తారా.?అని ప్రశ్నించారు. భూ కబ్జా కోరును అరెస్టు చేయకుండా ఇళ్ల స్థలాల హక్కుదారులను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో పాటు మరికొందరు నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఎం సంగారెడ్డి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అరెస్ట్ చేసిన వారందరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



50వ రోజుకు చేరిన.. డంపింగ్ యార్డు వ్యతిరేక ఉద్యమం



- నేడు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో... సామూహిక నిరాహార దీక్షలు
- ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేసిన ఆందోళన కారులు
- వరుస కార్యక్రమాల్లో ప్రజా సంఘాల పోరాట వేదిక, జేఏసీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్యారానగర్-నల్లవల్లి డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని ప్రారంభమైన ప్రజా ఉద్యమం సమరశీలంగా కొనసాగుతోంది. 50 రోజులుగా ప్రజలు సంఘటితంగా వివిధ రూపాల్లో పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు పోరాటం ఆపేది లేదంటూ భీష్మించుకుని వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీక్షలు, ధర్నాలు, ర్యాలీలు, వినతి పత్రాలు, వంటా వార్పు, రాస్తారోకోలు ఇలా అనేక రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో వివిధ రకాల కరపత్రాలేసి ప్రచారం చేసింది. గుమ్మడిదలను మరో జవహర్‌నగర్ చేయొద్దంటూ డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తూ ప్రజా బ్యాలెట్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందిరా పార్కు ఎదుట ధర్నా చేసింది. డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి మద్దతు తెలుపుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరాహార దీక్షలు చేయనున్నారు.

50వ రోజుకు చేరిన డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటం

డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటం 50వ రోజుకు చేరింది. గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్-నల్లవల్లి గ్రామాల్లో జీహెచ్‌ఎంసీ, రాంకీ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. 13 గ్రామాల ప్రజలు ఐక్యంగా జేఏసీగా ఏర్పడి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. గుమ్మడిదల, నల్లవలి, కొత్తపల్లి, మంబాపూర్ తదితర గ్రామాల్లో స్థానికంగానే దీక్షా శిబారాల్ని ఏర్పాటు చేశారు. ప్రతి రోజు స్థానిక ప్రజలు వంతుల వారిగా దీక్షల్లో కూర్చుకుంటున్నారు. మహిళలు, మైనార్టీలు, యువకులు, రైతులు, వృత్తిదారులు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రజలు దీక్షల్లో పాల్గొంటున్నారు. వంటా వార్పు కార్యక్రమం చేశారు. మహిళలు బతుకమ్మ ఆడారు. శివరాత్రి, హోలీ పండగల్ని సైతం పోరాట రూపంగా మార్చుకుని నిరసన తెలిపారు. మొదట్లో గొర్రెలు, మేకలు, పాడి గేదెలతో నర్సాపూర్ రోడ్డుపై భారీ ప్రదర్శనలు చేశారు. స్కూల్ విద్యార్థులు సైతం ప్రత్యేకంగా ర్యాలీలు నిర్వహించారు.

ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఉద్యమం

ప్యారానగర్ డంపింగ్ యార్డును రద్దు చేయాలని ప్రజలు చేస్తున్న ఆందోళనలకు అండగా ప్రజా సంఘాల పోరాట వేదిక నిలుస్తుంది. జేఏసీతో కలిసి వివిద రూపాల్లో కార్యక్రమాలు చేశారు. డంపింగ్ యార్డ్ వల్ల జరిగే ప్రమాదాల్ని వివరిస్తూ ప్రత్యేకంగా కరపత్రాలు వేసి ప్రచారం చేశారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ప్రతినిధుల బృందం జహావర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి అద్యయనం చేసింది. అక్కడ పాడైన పర్యావరణం, వ్యవసాయం, ప్రజల జీవితాల గురించి వివరిస్తూ ప్రత్యేకంగా కరపత్రాన్ని ముద్రించి గుమ్మడిదల ప్రాంత ప్రజలకు అవగహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధమైన ఓటు విలువ ద్వారానే డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకించాలన్న ఆలోచనతో ఈ నెల 21న 13 గ్రామాల్లో "ప్రజా బ్యాలెట్" కార్యక్రమాన్ని నిర్వహించారు. పది వేల మంది వరకు బ్యాలెట్‌లో పాల్గొని డంపింగ్‌యార్డ్‌ను వ్యతిరేకించారు. తమ నిరసనను హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పాలకులకు తెలియజేయాలన్న ఉద్దేశంతో ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 24న ధర్నా నిర్వహించారు. అదే విధంగా సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ, పటాన్‌చెరు ఏరియా కమిటీల ఆధ్వర్యంలోనూ డంపింగ్ యార్డ్ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించారు. సంతకాల సేకరణ, దీక్షలు, కలెక్టరేట్ ఎదుట ధర్నా వంటి ఆందోళనలు నిర్వహించారు.

ప్రజల జీవితాలతో చెలగాటమొద్దు



కె.రాజయ్య, ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్

రాంకీ సంస్థ ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దు. ఇప్పటికే జవహర్‌నగర్ చుట్టూ 15 కిలో మీటర్ల దూరం వరకు ప్రజా జీవితాల్ని అతలాకుతలం చేసిన రాంకీ సంస్థ గుమ్మడిదల ప్రాంతాన్ని కూడా పాడు చేయాలని చూస్తుంది. పచ్చటి పంట పొలాలు, అడవుల్ని దెబ్బతీసే డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు ప్రజా సంఘాల పోరాట వేదిక ఉద్యమిస్తుంది. ప్రభుత్వం తక్షణమే డంపింగ్ యార్డ్‌ను రద్దు చేస్తూ ప్రకటన చేయాలి. అధికారులు పట్టించుకోవాలి. లేని పక్షంలో ప్రజా ఉద్యమం మరింత సమరశీలంగా ముందుకు సాగుద్ది. ప్రజా బ్యాలెట్, ఇందిరా పార్క్ వద్ద ధర్నా, కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరాహార దీక్షల వంటి ఆందోళనలు సాగుతున్నాయి.

నేడు కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరాహార దీక్షలు

ప్యారానగర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటానికి మద్దతుగా సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. ఉదయం 10.30 గంటలకు దీక్షలను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు ప్రారంభిస్తారు. ఈ దీక్షల్లో పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ కె.రాజయ్య, సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింహలు, జిల్లా నాయకులు పాల్గొననున్నారు.

శాంతియుత మార్గంలో పోరాటం



జైపాల్‌రెడ్డి, జేఏసీ చైర్మెన్

డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని జేఏసీ శాంతియుత మార్గంలోనే పోరాటం చేస్తుంది. 50 రోజులుగా ప్రజలు ప్రశాంతంగా నిరసన తెల్పుతున్నారు. ఎక్కడా ఏలాంటి గొడవలు చేయలేదు. ప్రజాస్వామ్య పద్దతిలో ప్రజా బ్యాలెట్ నిర్వహించి తమ నిరసన తెలిపాం. ప్రభుత్వం డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు కూడా ప్రజలు ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తారు. ప్రజల పోరాటానికి సీపీఐ(ఎం), ప్రజా సంఘాల పోరాట వేదికలు అండగా నిలవడం వల్ల ప్రజల్లో మరింత ఐక్యత పెరిగింది. అందరం కలిసి పోరాటాన్ని కొనసాగిస్తాం.

గీతంలో మాలిక్యులర్ డాకింగ్‌పై కార్యశాల



నవతెలంగాణ-పటాన్‌చెరు

హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'మాలిక్యులర్ డాకింగ్ అండ్ వర్చువల్ స్క్రీనింగ్'పై ఒక రోజు ఆచరణాత్మక కార్యశా లను ఏప్రిల్ 11న నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడిం చారు. ఈ ముఖా ముఖి కార్యక్రమంలో పాల్గొనేవారికి ప్రముఖ మాలిక్యులర్ మోడలింగ్ సాఫ్ట్ వేర్ అయిన మోల్ సాఫ్టను ఉపయోగించి కంప్యూటేషనల్ డ్రగ్ డిస్కవరీలో లోతైన అవగాహనను కల్పించడంతో పాటు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడానికి రూపొందించినట్టు తెలిపారు. మాలిక్యులర్ డాకింగ్ అండ్ వర్చువల్ స్క్రీనింగ్ పరిచయం, డాకింగ్ మోడల్స్ యొక్క ఆప్టిమైజేషన్ అండ్ వాలిడేషన్, డ్రగ్ డిస్కవరీలో రియల్-వరల్డ్ కేస్ స్టడీస్ వంటి ముఖ్య అంశాలపై ఈ కార్యశాలలో తర్ఫీదు ఇస్తామన్నారు. పుణేలోని అడ్వెంట్ ఇన్ఫర్మేటిక్స్‌లో అప్లికేషన్ సైంటిస్ట్ ఆదిత్య మిశ్రా ఈ కార్యశాలలో ప్రధాన శిక్షకుడిగా పాల్గొంటారన్నారు. అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, కంప్యూటేషనల్ డ్రగ్ డిస్కవరీలో నిమగ్నమైన నిపుణుల కోసం దీనిని రూపొందించామని, కేవలం 30 మందికి మాత్రమే పాల్గొనే వీలుంటుందని ప్రిన్సిపాల్ స్పష్టీకరించారు. ఆసక్తి గలవారు ఏప్రిల్ 7వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రుసుము తదితర వివరాల కోసం డాక్టర్ ఎలగందుల సతీష్ 82394 77935, selagand@gitam.edu లేదా డాక్టర్ విన్యాస్ మాయాసా, 99491 23037, vmayasa@gitam.edu లను సంప్రదించాలని సూచించారు.

ఓయూలో గీతం అధ్యాపకుడి పుస్తకావిష్కరణ

గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.డి.ప్రభాకర్ పరిశోధనా పుస్తకం 'భారతీయ భాషల సామాజిక-ఆర్థిక ఆకృతి'ని బుధవారం ఆవిష్కరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని భాషాశాస్త్ర విభాగం నిర్వహించిన ప్రతిష్టాత్మక 13వ అంతర్జాతీయ తెలుగు భాషాశాస్త్ర సదస్సులో, భారత భాషాశాస్త్ర పండితుల సంఘం పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరరావు, ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, భారతీయ భాషల కేంద్ర సంస్థ అధ్యక్షుడు మాధభూషి సంపత్ కుమార్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించినట్టు తెలిపారు. జర్మనీలోని ప్రఖ్యాత ప్రచురణల సంస్థ లింకం జీఎంబీహెచ్ యూరోపా ప్రచురించిన ఈ పుస్తకం అంతర్జా తీయ గుర్తింపు పొందిందని, ఇటీవల హైడెల్ బర్గ్ విశ్వవిద్యాలయ గ్రంథాలయం, జర్మనీలోని పలు జాతీయ గ్రంథాలయాలో దీనిని ప్రతులను ఉంచినట్టు వివరించారు. భారతీయ భాషల సామాజిక-ఆర్థిక ప్రొఫైలింగ్, సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో భాష పోషించే కీలక పాత్రను ఈ పుస్తకం అన్వేషిస్తుందన్నారు. లోతైన పరిశోధన, గణాంక విశ్లేషణ ద్వారా, ఆధునిక సమాజాలలో ఆర్థిక వృద్ధికి భాష ఎలా కీలక మైన చోదకంగా పనిచేస్తుందో రచయిత వివరించినట్టు తెలిపారు. ఆర్థిక కార్యకలాపాలు, సంపద ఉత్పత్తిని మెరుగుపరచడానికి స్థానిక భాషలను పారిశ్రామిక రంగాల్లో అనుసంధానించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, భాష, ఆర్థిక వ్యవస్థల మధ్య లోతైన సంబంధాన్ని ఈ అధ్యయనం ప్రస్ఫుటీకరించినట్టు తెలిపారు.

రక్త దానం చేసి.. ప్రాణదాతలుగా నిలవండి

- సంగారెడ్డి పట్టణ సీఐ రమేష్
- గొల్లపల్లి ప్రశాంత్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా రక్తదాన కార్యక్రమం
- స్నేహితుడి కుటుంబానికి బాసటగా నిలవడం అభినందనీయం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు





నవతెలంగాణ-సంగారెడ్డి

సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు కుమారుడు ప్రశాంత్ ద్వితీయ వర్ధంతిని పురస్క రించుకుని బుధవారం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణ సీఐ రమేష్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు హాజరై మాట్లాడుతూ.. గొప్ప భవిష్యత్తు ఉన్న గొల్లపల్లి ప్రశాంత్ చిన్నతనంలో మృతి చెందడం బాధాకరమన్నారు. కుమారుడిని కోల్పోయిన దుఃఖంలోనూ ఇతరులకు సేవ చేయాలన్న ఆలోచనలతో వర్ధంతిని పురస్కరించుకొని రక్తదానం చేయడం అభినందనీ యమని జయరాజ్‌ను మెచ్చుకున్నారు. రోడ్డుపై డ్రైవింగ్ చేసే సమయంలో ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, అతి వేగంతో వాహనాలు నడపకూడదన్నారు. యువత రక్త దానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. రక్తదానం కార్యక్రమంలో పాల్గొన్న యువకులను అభినందించారు. ప్రశాంత్ స్నేహితులు ఇలాంటి మంచి కార్యక్రమానికి ముం దుకు రావడం, స్నేహితుని మృతితో ఆ కుటుంబానికి బాసట గా నిలవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ విరంజానేయులు, డాక్టర్ వెంకట్రాం, బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ మల్లయ్య, రాజు, సిపిఎం పార్టీ నాయకులు నాయకులు మానిక్, సాయిలు, నర్సింలు, అడివయ్య, యాదగిరి, క్రిష్ణ, ఆత్మకూరు బ్లడ్ డోనర్ అధ్యక్షులు రవి స్నేహితులు అనిల్ మధుకర్, కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు, మహిళా ఉద్యోగుల భద్రతకు కట్టుబడి ఉన్నాం

ట్రాఫిక్ సమస్యను అధిగమించదానికి త్వరలో ట్రాఫిక్ మార్షల్స్

పాశమైలారం ఇండస్ట్రియల్ అసోసియేషన్, ఎస్ఎస్ఎస్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



నవతెలంగాణ-పటాన్‌చెరు

జిల్లాలో పరిశ్రమలు, మహిళా ఉద్యోగుల భద్రతకు కట్టుబడి ఉన్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాశమైలారం ఇండస్ట్రియల్ ఏరియా అథారిటీ, ఎస్ఎస్ ఎస్‌సి(సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలో పాశమైలారం ఐలా కార్యాలయంలో పరిశ్రమల భద్రత, ట్రాఫిక్ సమస్యల నివారణకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల భద్రతా, పరిశ్రమలలో పనిచేస్తున్న ఉద్యోగుల, మహిళా ఉద్యోగుల భద్రతకు కట్టుబడి ఉన్నామని, మహిళా ఉద్యోగుల భద్రతకై షీ-షటిల్ పేరుతో బస్సులు నడపడం జరుగుతుందని, త్వరలో మరిన్ని బస్సులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల భద్రత దృష్ట్యా ప్రతి పరిశ్రమల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సరైన గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే ఉద్యోగాలలోకి తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం పరిశ్రమలకు చెందిన వాహనాల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించాలని, భారీ వాహనాలు రాత్రి సమయంలోనే అనుమతించాలని ఎస్పీ సూచించారు.ఎస్ఎస్ఎస్‌సి బలోపేతానికి అన్ని పరిశ్రమలు ముందు రావాలని సూచించారు. పరిశ్రమలకు సంభందించి ఏవైన సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పారిశ్రామికవాడలలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి త్వరలో ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ. సంజీవ రావ్, పటాన్‌చెరు డియస్పీ రవీందర్ రెడ్డి, ఎస్ఎస్ఎస్‌సి జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజరర్ యం. రమణారెడ్డి, ఐలా వైస్ చైర్మెన్ కె. రాఘవ రెడ్డి, ఐలా ట్రెజరర్ జి.వి.పి. రాజు, వివిధ ఫార్మా ఇంజనీరింగ్ పరిశ్రమలకు చెందిన పారిశ్రామిక వేత్తలు పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలు నాయక్, భానూర్ సీఐ స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీఆర్డీ మహిళా విభాగం రాష్ట్ర కో కన్వీనర్‌గా జయలక్ష్మి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఎన్పీఆర్డీ మహిళా విభాగం రాష్ట్ర కో కన్వీనర్‌గా జయలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలుగా మేరీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాదులో ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) మహిళా వికలాంగుల రాష్ట్ర సదస్సుకు 15 జిల్లాల నుంచి 100 మంది మహిళా వికలాంగులు హాజరయ్యారు. సద స్సులో పలు విషయాలపై తీర్మానం చేశారు. అనంతరం ఎన్పీఆర్డీ మహిళా విభా గం రాష్ట్ర కమిటీ 27మందితో ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. ఈ నేపథ్యంలో పటాన్‌చె రు మండలం చిట్కూల్‌కు చెందిన జయలక్ష్మిని రాష్ట్ర కో కన్వీనర్‌గా, బీహెచ్ ఈఎల్‌కు చెందిన మేరీరాష్ట్ర కమిటీ సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్కానింగ్ సెంటర్లను ప్రతీనెలా విజిట్ చేయాలి

సక్రమంగా లేని హాస్పిటల్లో సీజ్ చేసి.. కేసులు బుక్ చేయాలి

సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రతీ ఒక్క హాస్పిటల్లో స్కానింగ్ సెంటర్‌లను ప్రతీనెల విజిట్ చేయాలని.. సక్రమంగా లేని ఆసుపత్రులు సీజ్ చేసి కేసు బుక్ చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పీసీ, పీఎన్‌డీటీ, డిస్ట్రిక్ లెవెల్ మల్టీ నెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ అడ్వైజరీ కమిటీ మీటింగ్, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ మీటింగ్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం నిర్వహించారు. జిల్లాలో రిజిస్టర్ చేసుకున్న స్కానింగ్ సెంటర్స్ వివరాలు, కొత్తగా నమోదు చేసుకున్న వారు రెన్యువల్ నమోదు సెంటర్స్ వివరాలను డీఎం అండ్ హెచ్ఓ గాయత్రి దేవి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క హాస్పిటల్లో స్కానింగ్ సెంటర్‌ను ప్రతినెల క్రమం తప్పకుండా విజిట్ చేసి హాస్పిటల్లో రేట్స్ తప్పక డిస్ప్లే చేయాలని, హాస్పిటల్‌కి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ద్వారా స్కూళ్లలో కాలేజీల్లో చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఆసుపత్రికి సంబంధించిన సెక్స్ రేషియో లిస్టు తయారు చేయాలని, పోలీస్ డిపార్ట్మెంట్ వారి సహాయంతో సక్రమంగా లేని హాస్పిటల్లో సీజ్ చేసి కేసులు బుక్ చేయాలన్నారు. ఎమ్మన్నార్ ఆసుపత్రికి రాష్ట్ర టీం పరిశీలనలో రికార్డులు సరిగా లేవని తెలియడంతో వారికి నోటీసు ఇచ్చి రూ.50 వేల ఫైన్ వేసినట్టు చెప్పారు. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రిలో ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్,ఇతరులకు అబార్షన్ చేయొద్దని.. చేస్తే కఠినంగా శిక్షించాలన్నారు. మొదటిసారి గర్భం దాల్చిన మహిళలకు అత్యవసరమైతే తప్పా సీ సెక్షన్స్ ద్వారా ప్రసవాలు జరుపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జడ్జ్ రమేష్, ఆడిషనల్ ఎస్పీ సంజీవరావు, రెడ్ క్రాస్ చైర్మన్ సి.వనజ రెడ్డి, పీఓఎంసిహెచ్ డాక్టర్ నాగ నిర్మల, ఎం.ప్రసాద్ డెమో, రవి, శశి, పల్లవి ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనేనని కుటుంబ సభ్యుల ఆరోపణ
- హాస్పిటల్‌లో నిరసన





నవతెలంగాణ-సిద్ధిపేట

చికిత్స పొందుతూ బాలిక మృతి చెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలోని శివాజీ నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణం మారుతీ నగర్‌కు చెందిన శ్రీకాంత్ చారి, స్వాతి దంపతులకు మాన్విత(4) ఒక్కతే సంతానం. కాగా ఈనెల 15న మాన్వితకు జ్వరం రావడంతో హాస్పిటల్‌కు తీసుకు వచ్చారు. రెండు రోజులపాటు డాక్టర్లు ఇచ్చిన మెడిసిన్ వాడిన వాళ్లు గత సోమవారం పాపను హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. అనంతరం పాపకు నిమోనియా సమస్య ఉందని, లీవర్ ఆపరేషన్ చేయాలని చెప్పిన డాక్టర్లు ఈ నెల 24వ తేదిన సోమవారం పాప మాన్వితకు ఆపరేషన్ చేశారు. అందుకుగాను లక్ష ఇరవై వేల రూపాయలను తీసుకోగా, అప్పటి నుంచి ఐసీయూలోనే ఉన్న పాప బుధవారం మధ్యాహ్నం వరకు సెల్ ఫోన్‌లో రీల్స్ చూస్తూ హాయిగా ఉందని, మధ్యాహ్నం పాప వద్దకు వచ్చిన డాక్టర్ ఆమెకు ఇంజక్షన్ ఇచ్చి వెళ్లిన కొద్దిసేపు తర్వాత ఫిట్స్ రావడంతో, కొద్దిసేపు గిలగిలా కొట్టుకొని పడిపోయిందని, డాక్టర్లు వచ్చి సీపీఆర్ చేసినప్పటికీ ప్రాణం దక్కలేదని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పాప చనిపోయిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు.

చిన్నారుల సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రత్యేక శ్రద్ధ

- కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ రాజు సంగాని
- ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే కృష్ణవేణి విద్యాసంస్థల ప్రత్యేకత అని ఆ విద్యాసంస్థల చైర్మెన్ రాజు సంగాని అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని సీతారామపురంలో జరిగిన కృష్ణవేణి పాఠశాలల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆ సంస్థ చైర్మెన్ రాజు సంగాని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీకి వచ్చేస్తున్న చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. తమ ఉపాధ్యాయులూ నైపుణ్యతను ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూనే విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు చెప్పారు. ఆ సంస్థ డైరెక్టర్ అచ్చే రాజు మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ నుండే సిల్క్ డెవలప్మెంట్ పై విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిస్తు, అన్ని రంగాల్లో ప్రోత్సాహం కల్పిస్తూ చదువుతోపాటు ఆటపాటలలో కూడా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి పాఠశాలల ప్రిన్సిపాల్స్ ప్రసన్న, ఉపాధ్యాయులు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట మురళీకృష్ణను వెంటనే అరెస్టు చేయాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

సినీ నిర్మాత మేడికొండ వెంకట మురళీకృష్ణ పుల్కల్ మండలంలోని గోంగ్లూర్ గ్రామంలో అక్రమాలు, దౌర్జన్యాలు, దాడులు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేసున్నాడని.. ఆయనపై పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జంబల్ సంతోష్, జిల్లా నాయకులు కొటారి నర్సింలు, గణపతి, డివైఎఫ్ఐ డివిజన్ బాధ్యులు మహిపాల్ లు డిమాండ్ చేశారు. దళిత సీనియర్ నాయకులు పల్లె సంజీవయ్య కుటుంబ సభ్యులపై దాడిని ఖండిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. గొంగ్లూర్ గ్రామంలో సినీ నిర్మాత మేడికొండ మురళి కృష్ణ భూములు లీజుకు తీసుకుంటూ.. లీజు ఒప్పందం ముగిసిన తర్వాత కూడా రైతులకు భూములు ఇవ్వకుండా దౌర్జన్యం చేసున్నాడన్నారు. తనకే భూములను విక్రయించాలని.. ఆ ధరలు కూడా తానే నిర్ణయిస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడన్నారు. ఒకవేళ భూములు తనకు విక్రయించకపోతే కిరాయి గుండాలతో బెదిరిస్తూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఆక్రమంలోనే పల్లె సంజీవయ్య భూమిని కబ్జా చేయాలని.. సంజీవయ్య, ఆయన కుమారుడిపై దౌర్జన్యంగా దాడి చేసి.. కుమారుడి కళ్లల్లో కారం కొట్టి కిడ్నాప్ చేశారన్నారు. దాడులు చేయిస్తున్న మురళీకృష్ణపై పీడీ యాక్ట్ పెట్టి.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థల ప్రొసీడింగ్ అందజేత



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం పట్టణ ప్రాంతంలో విద్యుత్ సమస్య తీర్చేందుకు ప్రభుత్వం సుమారు రూ.6 కోట్లు కేటాయించినప్పటికీ సరైన స్థలం లేక ఎన్నో ఏండ్లుగా సబ్ స్టేషన్ నిర్మాణం జరగలేదు. కాగా ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో మయూరినగర్‌లోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో గల ప్రభుత్వ స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని గుర్తించారు. బుధవారం స్థలానికి సంబంధించిన ప్రొసిడింగ్, పంచనామా పత్రాలను కార్పొరేటర్ పుష్ప నగేష్, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి చేతుల మీదుగా విద్యుత్ శాఖ ఏడి నాగరాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ రెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ రమాపతి, ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహగౌడ్ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

నవతెలంగాణ-సంగారెడ్డి



బీఆర్ఎస్ నాయకులు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నక్క నాగరాజుగౌడ్ తండ్రి నరసింహగౌడ్ అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయం తెలిసి స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం నరసింహగౌడ్ మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలను నక్క నాగరాజ్ గౌడ్ ను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే వెంట సీడీసీ మాజీ చైర్మెన్‌లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింలు, రామప్ప, జీవి శ్రీనివాస్, జలంధర్ తదితరులున్నారు.

50వ రోజు బతుకమ్మ ఆడుతూ నిరసన

నవతెలంగాణ-గుమ్మడిదల



మండలంలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డ్‌కి వ్యతిరేకంగా నిరవధిక నిరసన సమ్మెలు కొనసాగుతూనే ఉన్నాయి. అందులో భాగంగా బుధవారం 50వ రోజున మహిళలు బతుకమ్మ ఆడుతూ నిరసన చేపట్టారు. యాభై అక్షరం రూపంలో కూర్చుని నిరసన ఆందోళన చేపట్టారు. డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా ప్యారానగర్, కొత్తపల్లి, గుమ్మడిదల గ్రామాల్లో నిరవధిక సమ్మెలు కొనసాగుతూనే ఉన్నాయి. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. పచ్చటి పల్లె బతుకులను ఆగం చేయొద్దు అంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డంపింగ్‌యార్డ్‌ను రద్దు చేసే వరకు ఉద్యమం ఆపబోమని జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో స్పష్టం చేశారు.



గణిత శాస్త్రం పరీక్షకు 99.82శాతం హాజరు

నవతెలంగాణ-సంగారెడ్డి

ఎస్ఎస్సి గణిత శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలో 22411 మంది విద్యార్థులకు గాను.. 22370 మంది హాజరయ్యారని, 41 మంది గైర్హాజరయ్యారన్నారు.హాజరు శాతం 99.82గా ఉందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు కంది, సదాశివపేట్ మండలంలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ పందరి నాయక్ కొండాపూర్, సదాశివపేట మండల లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్స్ 41 పరీక్ష కేంద్రాలను సందర్శించారు.



గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణం రంజోల్ గ్రామంలోని నక్షత్ర వెంచర్‌లో న్యాల్‌కల్ మండలం చీకుర్తి బిరాదార్ రామకృష్ణారెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ వేడుకలో టీఎస్ఎస్ సీసీడీసీ(ఎస్సి కార్పొరేషన్) మాజీ చైర్మెన్ వై.నరోత్తం పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడివిరెడ్డి, నాయకులు బాల్‌రాజ్, జనార్ధన్‌రెడ్డి, విజేందర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చెంగల్ జైపాల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-మనూర్

మండలంలోని శేలిగేరా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అంజయ్య ముదిరాజ్ వివాహం బుధవారం జరిగింది. ఈ వివాహానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్ రెడ్డి హాజరై నూతన వధు వరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు వెంకట్‌రెడ్డి, నర్సయ్య, భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యువత చేతుల్లోనే గ్రామాలభివృద్ధి

నవతెలంగాణ-ఝరాసంగం

యువత చేతుల్లోనే గ్రామాలభివృద్ధి ఆధారపడి ఉందని స్థానిక ఇన్చార్జి ఎస్సై సంగమేశ్వర అన్నారు. మండల పరిధిలోని సంఘం కె గ్రామంలోమూడ్రోజుల క్రితం జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పారిశుద్ధ్యం, మూఢనమ్మకాలు, సైన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సేవా భావం పెంపొందిం చుకోవాలని సూచించారు. అంతేగాకుండా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు చట్టాల ప్రా ముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం.వెంకట్రాంరెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, నందుగౌడ్, దత్తు, నవీన, అధ్యాపకులు రమేష్ దీపిక, కీర్తి,నికిత, వాలెంటర్లు పాల్గొన్నారు.



నూతన బోరుతో తీరిన నీటి సమస్య

నవతెలంగాణ-మనూర్

మండల కేంద్రంలోని చర్చి వద్ద చర్చి వద్ద బుధవారం నూతన బోరు వేశారు. దాంతో ఇక్కడి నీటి సమస్య తీరిపోయింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ రవీందర్ మాట్లాడుతూ.. పదేండ్ల క్రితం వేసిన బోరుతో ఇక్కడ పుష్కలంగా నీరు ఉండేవన్నారు. దాంతో ఇక్కడ తొట్టి నిర్మాణం చేయగా.. గ్రామంలోని పశువులకు దాహార్తి తీరేదన్నారు. అయితే రెండేండ్ల క్రితం ఈ బోరు ఎండిపోయిందని.. దాంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని ఖేడ్ ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ నేపథ్యంలో మాజీ జిల్లా ప్రణాళిక సభ్యుల సహకారంతో నూతన బోరు వేయంచారన్నారు. సమస్యను పరిష్కరించినందుకు నాయకులు సాయిలు, అంజయ్య, రాజు, సంజీవులు, కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.



ఘనంగా భద్రకాళి వీరభద్ర స్వామి రథోత్సవం

నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మున్సిపాల్టీ పరిధిలోని బొంతపల్లి వీరన్న గూడెంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళి వీరభద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, ఈవో శశిధర్ గుప్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, బుధవారం తెల్లవారుజామున భక్తుల సమక్షంలో రథోత్సవాన్ని చేపట్టారు. వేలాదిమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఉత్సవాన్ని విజయవంతం చేసిన కమిటీ సభ్యులు, స్థానిక భక్తులకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

వసతులు కరువు

పెరిగిన ఎండలు.. ఇబ్బందుల్లో కూలీలు



- ఉపాధి హామీ పని ప్రదేశాల్లో వసతుల లేమి..
- ఇంటి నుంచి తెచ్చుకున్న బాటిల్ నీళ్లే దిక్కు
- కనిపించని ఫస్ట్ ఎయిడ్ కిట్స్
- పని ప్రదేశంలో వికలాంగులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ఝరాసంగం

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలను నివారించేందుకు నాటి కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం నేడు నీరుగారుతోంది. ఈ చట్టం కింద నీటి కుంట లు, ఊట కుంటలు, భూమి చదును, కందకాలు, ఊట కుంటలు, పొలాలకు కట్టలు, మట్టి రోడ్లు వంటి తదితర పనులను చేపడుతున్నారు. అయితే పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కూలీల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. పని ప్రదేశంలో కూలీలకు ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలని చట్టంలో ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అవేవీ కనిపించడం లేదు. ప్రస్తుతం ఎండలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నా.. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. కనీసం తాగు నీరు, ఎండ నుంచి తట్టుకునేలా టెంటు సౌకర్యం, అనుకోని సంఘటనలు జరిగిన, ఎండ నుంచి తట్టుకు నేందుకు కనీసం ఫస్ట్ ఎయిడ్ కిట్స్ కూడా అందుబాటులో ఉంచడం లేదు. దాంతో కూలీలు ఎండకు అల్లాడుతూ పిట్టల రాలుతు న్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత మంగళవారం రోజునే కుప్పానగర్ గ్రామంలో ఓ మహిళ మృతి చెందడం తోటి కూలీలను కలచి వేసింది. అలాగే ఎండల ధాటికి చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు.

8805 జాబ్‌కార్డులు..

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో 8,805 జాబ్ కార్డులు ఉన్న కుటుంబాలుండగా.. 17,132 మంది సభ్యులున్నారు. యాక్టివ్ జాబ్ కార్డ్స్ 6,617 ఉండగా యాక్టివ్ కూలీల సంఖ్య 12,010 మంది ఉన్నది. ప్రస్తుతం 2వేలకు పైగా కూలీలు ప్రతి రోజూ ఎండలోనేనే పనులు చేస్తున్నట్లు సమాచారం. బుధవారం ఎల్గోయి, బర్ధిపూర్ గ్రామాలను పరిశీలించగా పని ప్రదేశంలో టెంట్లు, ప్రాథమిక కిట్లు ఏవీ కనిపించలేదు. ఉదయాన్నే కూలీలు తెచ్చుకుంటున్న వాటర్ బాటిల్ నీళ్ళే వారికి దిక్కయాయి.



పని కాడ ఇబ్బందులు పడుతున్నాం



ఉపాధి పని చేసే చోట మంచినీళ్లు, నీడ లేక ఇబ్బంది పడుతున్నాం. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర సమయంలో ప్రాథమిక కిట్లు లేవు. గ్రామం నుంచి పని ప్రదేశాలు చాలా దూరంలో ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పనులు జరిగే చోట వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి.

- పి.రమేష్, వికలాంగుడు

సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి హామీ కూలీలకు కనీస అవసరాలు కల్పించాలి. తాగేందుకు ఇంటి నుండి పొద్దున బాటిళ్లలో తెచ్చుకుంటున్నాం. అవి ఎండకు వేడి అవుతున్నాయి. వాటిని తాగలేకపోతున్నాం. పనులు ప్రారంభమై చాలా రోజులైంది. కానీ ప్రభుత్వం పనిముట్లు అందించడం లేదు. సౌకర్యాలు కల్పించి పనిముట్లు అందించాలి.

- దండు రాములు, ఉపాధి కూలీ

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- భారతినగర్ డివిజన్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-రామచంద్రాపురం



మౌలిక వస్తువుల కల్పనకు పెద్దపీట వేస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలిపారు. భారత్‌నగర్ డివిజన్లో బుధవారం రూ.98 లక్షల 50 వేల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులు మరియు వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జోగిపేట

విద్యార్థుల కంటి చూపు సమస్యలను పారదోలేందుకు ఉచితంగా ప్రభుత్వం కంటి పరీక్షలను నిర్వహించి, కంటి అద్దాలను ఉచితంగా అందజేస్తుందని.. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సౌజన్య సూచించారు. పట్టణంలోని ఆయా ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలల్లో ఆర్‌బిఎస్‌కె కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్, కంప్యూటర్స్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగించడం వలన కంటిలోపం వస్తుందని గుర్తించినట్టు చెప్పారు. కంటి లోప సమస్యలను పరిష్కరించేందుకే కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అశోక్, ఫాతిమా, పీఎంఓ భీమేష్, ఆర్‌బిఎస్‌కె టీం సభ్యులు, ఆయా పాఠశాలఅధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జోగిపేట



నిరుద్యోగ యువతీ యువకుల కోసం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అందోల్, జోగిపేట మున్సిపల్ 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు కూడా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రూ.50వేల లోపు రుణం తీసుకుంటే వంద శాతం సబ్సిడీ కల్పిస్తుందన్నారు. మొత్తం నాలుగు లక్షల వరకు రుణ సహాయం అందిస్తుందన్నారు. సబ్సిడీతోపాటు బ్యాంకు రుణం కూడా ఉంటుందన్నారు. గ్రామాల్లోని లబ్ధిదారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయాలలో, మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించా లన్నారు. గ్రామీణ ప్రాంతాల వారి వార్షికఆదాయం రూ.1.50 లక్షలు ఉండాలని, అర్బన్ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.2 లక్షల వరకు ఉండాలని ప్రభుత్వం సూచించిందన్నారు. నాన్ అగ్రికల్చర్ యూనిట్లకు 21-55 ఏళ్ల వారు అర్హులని, అగ్రికల్చర్ దరఖాస్తుదారులకు 60 ఏళ్ల వారికి ఏజ్ లిమిట్ విధించిందన్నారు. రుణాలకు ప్రభుత్వం ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించిందని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంరేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. మాట ఇచ్చిందంటే కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా నిలబెట్టుకుంటుందన్నారు.

కుల మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైమూద్ అలీ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.ఈ విందుకు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల మతాల అతీతంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, చంద్రప్ప, గౌసొద్దీన్, ముంగి శ్రీనివాస్ రెడ్డి, బలవంత రెడ్డి, రేజింతల్ గ్రామ నాయకులు మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సిరాజోద్దీన్, యునూస్, ఇంతియాజ్ తదితరులున్నారు.



దుర్గాభవాని ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ- నారాయణఖేడ్ రూరల్

స్థానికంగా గల దుర్గా భవాని ఆలయ 18వ వార్షికోత్సవం ఘనంగా జరుగుతున్నది. అందులో భాగంగా చండీ హవన, పురస్సర లలితా సహస్రనామ పారాయణం, మూలమంత్ర హవనం, బ్రహ్మశ్రీ మలమంచి మోహన్ జోషి ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయ్ కుమార్ సాగర్ దంపతులు, జైపాల్ రెడ్డి, లలితా దేవి సేవా మహిళా మాతృమూర్తులు, గ్రామ ప్రజలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కొరడా



- ఓ వైద్యాధికారిని విధుల నుంచి తొలగింపు, ఇద్దరు వైద్యులకు షోకాజు నోటీసులు
- వెంటనే చర్యలు చేపట్టాలని డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించిన కలెక్టర్
- మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-సంగారెడ్డి

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఒకరిని విధుల నుంచి తొలగిస్తూ, మరో ఇద్దరు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు అందిం చాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా వైద్యధికారిణిని ఆదేశించారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లాలో మాతా శిశు మరణాలు, మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అజ్మనాజ్ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు విచారణలో తేలడంతో డాక్టర్ అజ్మనాజ్‌ను విధులను తొలగించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. దౌల్తాబాద్, మల్చల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు డాక్టర్లకు షోకాజు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో 2023-24 సంవత్సరంతో పోల్చితే 2024-25లో మాతా శిశు మరణాలు 50శాతం తగ్గినట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రిస్కు కేసులకు ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందించేలా చూడాలన్నారు. హైరిస్కు కేసులో రెఫర్ చేస్తున్నప్పుడు డాక్టర్లు సమన్వయంతో కోఆర్డినేషన్ చేసుకో వాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు క్రమం తప్ప కుండా గర్భిణులను పరిశీలించి వారికి సూచనలు సలహాలుఇవ్వాల న్నారు. పౌష్టికాహారం, మందులు వాడేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడడం, మందులు వాడేలా, పౌష్టికాహారం తీసుకునేలా చూస్తే చాలా వరకు సమస్యలు తగ్గుతాయ న్నారు. వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో.. సెంటర్లలో తనిఖీలు నిర్వహిం చాలన్నా రు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి గాయత్రిదేవి, జిజిహెచ్ సూపరింటెంట్ అనిల్ కుమార్,వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు..

నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని మల్లెపల్లి గ్రామపంచాయతీలో చలివేంద్రాన్ని తాజా మాజీ జెడ్పిటిసి పండాల పద్మావతి, గ్రామ ప్రత్యేక అధికారి మర్రి ప్రదీప్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా.. రోడ్డు వెంట వెళ్లే వారి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సమయంలో ఇబ్బంది కలగకుండా.. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కటకం శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-సంగారెడ్డి

గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు రాజీవ్ యువ వికాసం పథకానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి టి.అకిలేష్‌రెడ్డి తెలిపారు. వచ్చేనెల 5 తారీఖు దరఖాస్తులకు చివరి తేదీ అని.. ఆసక్తి గల వారు http://tgobmms.cgg.gov.inద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

నవతెలంగాణ-రామచంద్రాపురం

ఇంటి పన్ను బకాయిపై వడ్డీని 90శాతం మినహాయింపు చేస్తూ ప్రభుత్వం వెసులు బాటు కల్పించిందని తెల్లాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. కాబట్టి మున్సిపాల్టీ ప్రజలు వెంటనే ఇంటి పన్ను ప్రస్తుత, బకాయి పన్నులను సంబంధిత బిల్ కలెక్టర్లకు గాని, కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో గాని, https://cdma.cgg.gov.in/cdma_arbs/CDMA_PG/PTMenuలోగాని చెల్లించి రశీదు పొందాలన్నారు. మార్చి 31 వరకు ఉన్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవతెలంగాణ
మెదక్
3
గురువారం | 27 మార్చి 2025 | www.navatelangana.com

కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ-నర్సాపూర్

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారా నగర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నర్సాపూర్ పట్టణంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష బుధవారం 36వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా బుధవారం నర్సాపూర్ పట్టణానికి చెందిన కుమ్మరి శాలివాహన సంఘం వారు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. సంఘం గౌరవాధ్యక్షులు కుమ్మరి నాగేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేందర్, సోషల్ మీడియా ఇన్చార్జి గణేష్, నర్సాపూర్ మండల అధ్యక్షులు కుమ్మరి రమేష్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, చెన్నయ్య, రాజు, కుమ్మరి కృష్ణ, రఘు, ఆంజనేయులు, శ్రీశైలం, కిరణ్, జ్ఞానేశ్వర్, ప్రసాద్, మధు, శ్రీనివాస్, అశోక్, గణేష్, నవీన్, లింగం, బాలరాజు, అనిల్, హనుమంతు తదితరులు దీక్షలో కూర్చున్నారు.

ఢిల్లీ వెళ్లిన డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

ఢిల్లీలో ఏఐసిసి అగ్రనేతలతో తెలంగాణలోని అన్ని జిల్లాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులతో ఈ నెల 27వ తేదిన సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి బుధవారం మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆయనతోపాటు ఇతర జిల్లాల డీసీసీ అధ్యక్షులు ఉన్నారు. అందులో భాగంగా మొదటగా ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌ను ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు గౌడు మాట్లాడుతూ 18 ఏళ్ల తర్వాత జిల్లా అధ్యక్షులతో ఏఐసీసీ అగ్ర నేతలు సమావేశం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సమావేశంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా కానుందని ఆయన తెలిపారు. ఆయనతోపాటు సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, ఇతర జిల్లాల డీసీసీ అధ్యక్షులు ఉన్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా రోడ్డు మారడం లేదు

- గుంతల మయంగా ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలి
- సీపీఎం పాదయాత్ర
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ మల్లేశం



నవతెలంగాణ-వెల్దుర్తి 74

ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు మారుతున్నా రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ మల్లేశం అన్నారు. గుంతల మయంగా ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని ఆయన కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో వెల్దుర్తి నుంచి బండ పోసాని పల్లె వరకు చేపట్టిన పాదయాత్ర కార్యక్రమాన్ని జెండా ఊపిసీపీఎం జిల్లా కార్యదర్శి నరసమ్మ ప్రారంభించారు. బండ పోసాని పల్లి గ్రామానికి చేరుకొని రాత్రి బస చేసి ప్రజలతో మాట్లాడి బుధవారం బస్వాపూర్ గ్రామం నుంచి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ మల్లేశం ఆధ్వర్యంలో సీపీఎం మండల కార్యదర్శి గౌరీ నరేందర్ అసంఘటిత రంగ కార్మికులతో కలిసి మెదక్ కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ.మల్లేశం మాట్లాడుతూ గుంతల మయమైన సింగిల్ రోడ్డును రెండు వరుసల రోడ్డుగా మార్చడానికి నిధులు మంజూరు చేసి, తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో దాదాపుగా అన్ని మండలాల కేంద్రాల నుంచి ఆర్అండ్‌బి, లేదా పంచాయతీరాజ్ రోడ్లను కలుపుతూ రెండు వరుసల రోడ్లు ఉన్నాయన్నారు. కానీ ఒక వెల్దుర్తి మండలం కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి మాత్రం ఒకే వరుసగా గుంతల మయంగా ఉందన్నారు. ఉన్న రోడ్డు సైతం గుంతలతో కంకర తేలి రాకపోకలకు నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయన్నారు. ఉద్యోగస్తులు వ్యాపారస్తులు, విద్యార్థులు, వ్యవసాయదారులు ఈ రోడ్డు వెంబడి నిత్యం ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. గుంతల మయంగా ఉన్న రోడ్డుపై ఆర్టీసీ బస్సులు నడపలేని పరిస్థితి ఉందన్నారు. పై చదువుల కోసం మెదక్ వెళ్లాలన్నా బస్సులు లేక చదువులకు విద్యార్థులు వెళ్లలేని పరిస్థితులు కూడా ఉన్నాయన్నారు. వెల్దుర్తి ప్రజలు ఉప్పు లింగాపూర్, బండపోసంపల్లి, రామయ్య పల్లి, శెట్టిపల్లి గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయులు ఇటు మెదక్ నుంచి వెల్దుర్తికి వచ్చి చదువులు చెప్పేందుకు సమయానికి బస్సులు లేక పాఠశాలలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులు మారుతున్నారు, ఏ ఎమ్మెల్యే కూడా రోడ్డును పట్టించుకోవడం లేదు. అందుకే సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి రెండు వరసల రోడ్డును నిర్మించాలని గత వారం రోజుల క్రితం ప్రజల ద్వారా సంతకాలు సేకరించామని, ఈ పత్రాలలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ అందజేయడం జరుగుతుందన్నారు.

సంతకాల సేకరణ పత్రాలతో డీఆర్ఓకు వినతి



వెల్దుర్తి నుండి మెదక్ వెళ్లే రోడ్డును వెడల్పు చేయాలని డబుల్ రోడ్డు గా నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో 2 రోజుల పాదయాత్ర నిర్వహించారు. బుధవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రోడ్డు కోసం ప్రజల ద్వారా సేకరించిన సంతకాల సేకరణ పత్రాలు డీఆర్ఓకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అజ్జమర్రి మల్లేశం మాట్లాడుతూ వెల్దుర్తి నుంచి మెదక్ రోడ్డు వెడల్పు చేసి డబుల్ రోడ్డుగా నిర్మించాలని డిమాండ్ చేశారు. వెల్దుర్తి నుండి మెదక్ వెళ్లే గ్రామాల ప్రజలు కూడా ఈ రోడ్డు సమస్యపై ఆందోళనలకు సిద్ధం కావాలని సిపిఎం పార్టీ పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోరింకల మల్లేశం, జిల్లా కమిటి సభ్యులు అజయ్, సంతోష్, వెల్దుర్తి మండల కన్వీనర్ గౌరీ, నాయకులు నరేందర్, అఫ్జల్, అశోక్, సాయిలు, శ్రీను, షౌకత్, లచ్చాగౌడ్, ప్రమీల యాదగిరి, నాగమణి, చౌకత్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు ఎండుతున్న పంటలు

ఏడుస్తున్న రైతులు
ఎండిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలో రోజురోజుకు ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు తక్కువ పోస్తున్నాయి. మండల కేంద్రానికి చెందిన బండారి నర్సింలు వరి పొలం ఎండిపోవడంతో అధికారులు బుధవారం పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటిని వృధా చేయకుండా పొలాలకు పారపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ, ఎంపీడీవో రాజిరెడ్డి, వ్యవసాయ అధికారి సోమ లింగారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీలత,రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రీతి , నరసింహారెడ్డి, బత్తుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని చెంది గ్రామంలో ఇటీవలే మరణించిన బానూరి చంద్రాగౌడ్ కుటుంబానికి మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తనవంతు సహకారం ఎల్లవేళలా అందజేస్తానన్నారు. చెంది గ్రామంలో ప్రతి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ జెడ్పీటీసీకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు పుల్లగూర్ల ముత్యంరెడ్డి, వెంకటరెడ్డి, మోహన్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, పోచయ్య బిక్షపతి, బానూరి కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



నవతెలంగాణ-శివ్వంపేట

పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాధికారి బుచ్చ నాయక్ తెలిపారు. మండలంలోని కొంతాన్ పల్లి, పాంబండ, దొంతి, చెంది, రత్నాపూర్, పిల్లుట్ల, శివ్వంపేట, చిన్నగొట్టిముక్కుల, పెద్దగొట్టిముక్కుల, గోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి గూడూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, సత్యం విద్యా మందిర్, గోమారం అక్షర పాఠశాల నుంచి పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆయన తెలిపారు. మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం శివ్వంపేట, చెంది, దొంతి, గోమారంలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు. మండలంలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బుచ్చ నాయక్ తెలిపారు. పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరై పరీక్షలు రాస్తున్నారని ఆయన వివరించారు.

పుట్టినరోజు సందర్బంగా చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-చేగుంట : చేగుంట పట్టణ ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి పుట్టినరోజు సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రజనకు ప్రవీణ్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్డు భాగ్యశ్రీ లేడీస్ ఎంపోరియం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ రఘురాములు, జూకంటి రాజా గౌడ్, భాగ్యరాజు, సుధాకర్, మధుసూదన్ యాదవ్, రామలింగం,మల్లేష్ ,తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై 90% వడ్డీ మాఫీ

కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్ : తూప్రాన్ పట్టణంలోని ప్రజలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి, పట్టణ, మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-పాపన్నపేట : మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని మెదక్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తమ్మాయపల్లిలో ఎల్లమ్మ కళ్యాణోత్సవం, బోనాల పండుగలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాపన్నపేటలోని మంజీరా గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు ఖర్జూర, పండ్లు తినిపించి ఉపవాస దీక్షలు విరమింప చేశారు. రంజాన్ మాసం ముస్లిం సోదరులకు చాలా పవిత్రమైన మాసమన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి. ప్రశాంత్ రెడ్డి. కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్ గుప్తా.. సీనియర్ నాయకులు హఫీజ్.. మాజీ ఆప్షన్ గౌస్ పాష, కలీం, చోటు, ఇబ్రహీం, మాజీ జెడ్పిటిసి మల్లప్ప, సీనియర్ నాయకులు శ్రీకాంత్, అకుల శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, నీటలక్షప్ప, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తు చేసుకోండి



నవతెలంగాణ -శివ్వంపేట

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఏఒ లావణ్య తెలిపారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళలు దరఖాస్తు చేయాలన్నారు. బ్యాటరీ స్ప్రెయర్లు, పవర్ స్ప్రెయర్లు, రోటవేటర్లు, సీడ్ కం పెర్టిలైజర్ డ్రిల్, డిస్క్ హ్యారో అందిస్తారని, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, జనరల్ కు 40 శాతం సబ్సిడీపై పనిముట్లు అందించబడతాయని తెలిపారు. లక్ష రూపాయల లోపు సబ్సిడీ పొందు మహిళా రైతులు, ఒక ఎకరం లోపు భూమి, అంతకన్నా ఎక్కువ సబ్సిడీ పొందుతున్నట్లయితే ఎకరం భూమి ఖచ్చితంగా ఉండాలన్నారు. దరఖాస్తు వెంట పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్ కు సంబంధించిన ఆర్సీ జిరాక్స్, పాస్ ఫోటో, నేల సారం సాయిల్ హెల్త్ కార్డు, బ్యాంకు పాసు బుక్ జిరాక్స్ జతచేయాలని సూచించారు. ఈ నెల 28 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, మిగతా సమాచారం కోసం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.



నవతెలంగాణ-చేగుంట

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలకు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. మండలానికి 4 చేతితో నడిచే బ్యాటరీ పంపులు, 3 పవర్ స్ప్రేయర్స్, 1 రోటవేటర్, 1 విత్తనాలు, ఎరువులు వేసే యంత్రం, 2 ట్రాక్టర్ తో నడిచే పరికరాలు, 1 ట్రాక్టర్ కేటాయించబడిందని తెలిపారు. కేవలం మహిళా రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. అర్హులైన మహిళ రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను ధరకాస్తు ఫారంతో కలిపి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మార్చి 28తేది లోగా ధరకాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీగురుపీఠం నిర్మాణానికి విరాళాలు అందించాలి

ట్రస్టు చైర్మన్ శివకుమార్ గౌడ్



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని గూడూరు గ్రామంలో చేపట్టిన శ్రీగురుపీఠం నిర్మాణానికి భక్తులు విరాళాలు అందించాలని శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శివకుమార్ గౌడ్ కోరారు. గుంటూరు శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దివ్య ఆశీస్సులతో ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. గురువుకు ప్రాధాన్యతను విషదీకరించే గురు పరంపర కలియుగ దత్తాత్రేయ అవతారుల అద్భుతమైన శ్రీదత్తాత్రేయ పంచాయతనం, షిరిడి సాయిబాబా ఆలయ నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి చేశామని, మిగతా పనుల కోసం భక్తులు తమకు తోచిన విధంగా విరాళాలను అందజేయాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు.

కాలువలను బాగు చేసుకున్న రైతులు

కాళేశ్వరం జలాలతో చెరువును నింపిన మల్కాపూర్ రైతులు



నవతెలంగాణ-తూప్రాన్

మండలంలోని పలు గ్రామాలలో కాళేశ్వరం జలాల కోసం చేపట్టిన కాలువ పనులను అధికారులు అర్ధాంతరంగా ఆపేశారు. రైతులు కాలువలను సొంత ఖర్చులతో బాగు చేసి తమ గ్రామ చెరువులోకి కాళేశ్వరం జలాలను మల్కాపూర్ చెరువులోకి తరలించి అలుగుపారించారు. గ్రామంలోని రైతులు డబ్బులను పోగుచేసుకొని సొంత ఖర్చులతో జెసిబి యంత్రాన్ని ఉపయోగించి, కాలువ మధ్యలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న రాళ్లు, రప్పలను తొలగించారు. యువకులు, రైతులు తీవ్రంగా కృషి చేసి చెరువులోకి నీరు సరఫరా జరిగేలా చూశారు. రైతుల శ్రమ ఫలించి, మల్కాపూర్ తుర్కచెరువు కాళేశ్వరం జలాలతో పూర్తిగా నిండిపోయి అలుగు పారింది. ఎండాకాలం(వేసవి)లో తుర్కచెరువు కాళేశ్వరం నీళ్లతో కళకళలాడుతోంది. చెరువులో నీటి ప్రవాహాన్ని చూసి గ్రామ రైతులంతా సంబరపడ్డారు. ఇదే స్ఫూర్తితో గుండ్రెడ్డిపల్లి గ్రామ రైతులు కూడా తమ పెద్ద చెరువును కాళేశ్వరం నీళ్లతో నింపడానికి కాలువలు బాగు చేయడానికి సిద్ధమయ్యారు. మల్కాపూర్ తుర్కచెరువు నుండి మధ్యలో ఉన్న దంతలకుంట, శనగచెరువు, నిండితే గుండ్రెడ్డిపల్లి చెరువులోకి నీటి ప్రవాహం మొదలవుతుంది.





మాటను నిలబెట్టుకున్న ఎంపీ



నవతెలంగాణ-గజ్వేల్

మెదక్ ఎంపీ రఘునందన్ రావు పుట్టినరోజుకు 7 నియోజక వర్గాలకు ఏడు అంబులెన్సను నియోజ కవర్గాల కు కానుకగా ఎంపీ అంబులెన్సను అందించినట్లు బీజేపీ రాష్ట్ర నా యకులు జస్వంత్ రెడ్డి తెలిపారు. బుధవారం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కార్యక ర్తలు గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్డెంట్ స్టాఫ్ నర్సులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఏర్పాటుకు భవన పరిశీలన

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న గ్రంథాలయం ఏర్పాటు కోసం బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి గ్రామ పంచాయతీ భవనం లోని ఓ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో గ్రంథాలయం ఏర్పాటు చేసే విధంగా చూస్తామని అంతేకాకుండా గ్రంథాలయం వల్ల విద్యార్థులకు యువకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ , కార్యదర్శి మల్లేశం, గ్రామ పెద్దలు, రాజీపేట లక్ష్మయ్య, తిరుపతి రెడ్డి , బిక్షపతి, మన్నె రవీందర్, నర్సింలు, యువకులు, రాజు , రవి, ప్రవీణ్ ,చందు, శ్యామా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డిఓ



నవతెలంగాణ-నిజాంపేట

తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌డీఓ రమాదేవి సందర్శించారు. తహశీల్దార్, ఎంపీడీఓ వ్యవసాయ అధికారితో ఆర్‌డీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ రమాదేవి మాట్లాడుతూ అన్ని గ్రామాలను సందర్శించి, తాగునీటి కొరత గురించి పరిశీలించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయి కార్యాలయాల్లో దరఖాస్తుదారులకు తాగునీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్,ఎఫ్-లైన్ పిటిషన్లు తదితర దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , కెజిబివి పాఠశాల నిర్మాణాలకు ప్రతిపాదించిన భూమిని ఆర్డీఓ సందర్శించి భూ యజమానులతో సంభాషించారు. పిటిషనర్లకు నో హెల్మెట్ నో ఎంట్రీ అని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించాలని సూచించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ, ఎంపీడీవో రాజిరెడ్డి, వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రీతి, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో తైబజార్ బహిరంగ వేలం



నవతెలంగాణ-వెల్దుర్తి

మండలంలోని గ్రామపంచాయతీకి సంబంధించి 2025-26 సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలం పాటను బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ప్రత్యేకాధికారి తహసిల్దార్ కృష్ణ అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ బహిరంగ వేలం పాటలో గ్రామపంచాయతీ కార్యనిర్వహణ అధికారి బలరాం గ్రామపంచాయతీ కార్యాలయ తైబజార్ నిబంధనలు చదివి వినిపించారు. గ్రామానికి చెందిన దండం ఆదర్శ్ రూ.10.67 లక్షలకు అత్యధిక పాటతో తైబజార్‌ను కైవసం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం వసూలు చేయాల్సి ఉంటుందని పంచాయతీ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు శ్రీనివాస్ గౌడ్‌తోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న యాజమానికి జరిమానా

మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

పట్టణంలోని వ్యాపార సముదాయాలలో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో హై ఫై కర్రీ పాయింట్ దుకాణ సమయంలో రెండు కిలోల ప్లాస్టిక్ కవర్లను మున్సిపల్ అధికారులు పట్టుకొని దుకాణ యాజమానికి రూ.1000 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎ.రఘువరన్, జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ మన్నే భాస్కర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ చింతల మధు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

సిడిపిఓ హేమా భార్గవి



నవతెలంగాణ-నర్సాపూర్

అంగన్వాడీలో చదువుతున్న చిన్నారుల విషయంలో అంగన్వాడి టీచర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ సిడిపిఓ హేమ భార్గవి అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని సునీత లక్ష్మారెడ్డి కాలనీలో గల అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో ప్రీ స్కూల్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మెనూ ప్రకారం ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని ఏర్పాటు చేయాలని అంగన్వాడి టీచర్లకు సూచించారు. అనంతరం అంగన్వాడి కేంద్రానికి వచ్చే తల్లులతో పాటు కలిసి సిడిపిఓ హేమా భార్గవి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు చిన్నారులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వారిపై కేసులు కొట్టివేయాలి



నవతెలంగాణ-మద్దూరు : ప్రజా సమస్యలపై పోరాటం చేసిన సీపీఐ(ఎం) నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే కొట్టివేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 2017లో సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశంలో మద్దూరు, మండల కేంద్రం నుంచి సలాకపూర్, నర్సాయపల్లి, వంగపల్లి, గ్రామాలకు బైరాన్ పల్లి, నుంచి దూల్మిట్టకు, దూల్మిట్ట నుంచి తోర్నాలకు బీటీ రోడ్లు వేయాలని లద్నూరు, రిజర్వాయర్లో నీళ్ల నింపి రైతాంగానికి సాగునీరు అందించాలని ధర్మారం, పిట్టల గూడానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండలంలో అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల సర్వసభ్య సమావేశం ను ముట్టడించడంతో సమస్యలు పరిష్కరించకపోగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులకు తొత్తుగా మారి అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారని ఆయన తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటివరకు రోజు కోర్టుల చుట్టే తిరగడం సరిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యలపై పోరాటం చేసే నాయకులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను కొట్టివేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

దివ్యాంగుల లబ్ధిదారులకు ఎంపికకు ఇంటర్వ్యూ



నవతెలంగాణ-దౌల్తాబాద్

ఆర్థిక పునరావాస పథకంలో భాగంగా దివ్యాంగుల లబ్ధిదారులకు ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని కన్వీనర్ దుబ్బాక సీడీపీఓ ఎల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగుల లబ్ధిదారుల కోసం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రోత్సాహంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడం కోసం ఆర్థిక పురావాస పథకంలో భాగంగా ప్రభుత్వం రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దానిలో భాగంగానే ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకున్న 11 మంది వికలాంగులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ , ఐకేపీ ఏపీఎం యాదగిరి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గిరిజ, ఎంపీవో సయ్యద్ గఫూర్ ఖాద్రి, అధికారులు పాల్గొన్నారు.

కాలువను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సిద్దిపేట

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రంగనాయక సాగర్ ప్రారంభమైన నాటి నుంచి బెల్లంకుంట రైతులను సాగునీళ్ల కోసం అనేక తంటాలు పడ్డామని, ఈ సంవత్సరం నీళ్లు వచ్చి మా పంటలు పండుతాయి అనుకుంటే గత రాత్రి దుండగులు కావాలని మా కాలువను మూసివేయడం బాధాకరమని, బెల్లం కుంటలోకి సాగునీరు వచ్చే విధంగా చూడాలని రైతులు అధికారులను కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ఈ చెరువు కింద దాదాపుగా 200 మంది రైతులను ఉంటామని, సాగుకు నీరు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావుకు విన్నవించుకోగా, ఆయన ఇరిగేషన్ అధికారుల ద్వారా కాలువ తీయించి, అందులో పైపులు వేసి పక్షం రోజుల క్రితం సాగునీరు వదలగా, గత రాత్రి కావాలని కొంతమంది కాలువ పైపులను బండరాళ్లతో మూసివేసి వేశారన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రెడ్డి రాజిరెడ్డి, గడ్డమీద రాజేశం, జంగి టి ఆనందం, ఏదుల అశోక్ రెడ్డి, ఏదుల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో 'ఎంజేపీ' ప్రతిభ



నవతెలంగాణ-వర్గల్

సిద్దిపేట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "ఒకే దేశం ఒకే ఎన్నిక" అనే అంశం పై జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాఫూలే మహిళా గురుకుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో ప్రతిభను కనబర్చిన పుప్పాల శ్రీజ, గంగుల నవ్య ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్ రావు తెలిపారు. విద్యార్థులని ప్రోత్సహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధ రాణి, భాగ్యలక్ష్మి లను వారు అభినందించారు. తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం సంతోషమని అన్నారు. మరింత ఉన్నత స్థాయికి చేరేలా విద్యార్థులను ప్రోత్సహిస్తామని అన్నారు.

31లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఈ నెల 31 లోగా తమ లైఫ్ సర్టిఫికెట్లను సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయములలో సమర్పించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అమ్మన చంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వకుంటే ఏప్రిల్ మాసం పెన్షన్ నిలిపి వేయ బడునన్నారు. మీ సేవా కేంద్రం ద్వారా గాని, పోస్టల్ డిజిటల్ పేమెంట్ పద్ధతి ద్వారాగానీ, ప్రత్యక్షంగా గాని అందించేందుకు అవకాశం ఉందని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు గమనించాలని కోరారు.

మహిళల ఆసియా కప్‌లో జంగపల్లి బిడ్డ



నవతెలంగాణ-మిరుదొడ్డి

థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగే 4వ మహిళల బేస్‌బాల్ ఆసియా కప్ క్వాలిఫైయర్‌లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికైన అక్బర్ పెట భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి గ్రామానికి చెందిన బేస్‌బాల్ క్రీడాకారిణి పోసానిపల్లి సౌమ్య ఏంపిక కావడం చాలా సంతోషకరంగా ఉందని తాజా మాజీ సర్పంచ్ కంచం యాదగిరి. మాజీ సర్పంచ్ బక్కన్న గారి ప్రతాప్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు కంచం యాదగిరి, ప్రతాప్ రెడ్డి, గ్రామ పెద్దలు సిద్దారెడ్డి బిక్షపతి తదితరులున్నారు.

ముందస్తుగా అడ్మిషన్లు చేయడం లేదు

నవతెలంగాణ-చేర్యాల

వచ్చే విద్యాసంవత్సరానికి తమ పాఠశాలలో ముందస్తుగా అడ్మిషన్లు చేయడం లేదని చేర్యాల పట్టణ కేంద్రంలోని ఓక్లే పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియాంక బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఇచ్చిన ఆదేశాల మేరకు పరీక్షల అనంతరం వరకు ఎలాంటి ముందస్తు అడ్మిషన్లు ఇకపై చేయబోమని, పాఠశాలలో ఎలాంటి పాఠ్య పుస్తకాల అమ్మకాలు ప్రారంభించలేదని తెలిపారు.

మృతుని కుటుంబానికి స్నేహితుల అండ



నవతెలంగాణ-కొండపాక

చిన్ననాటి మిత్రురాలి కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన పిల్లి సుజాత భర్త రాజనర్సింహ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సుజాతతో గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2008 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు అండగా నిలిచి రూ.21300లు ఆర్థిక సాయం బుధవారం అందజేశారు.


ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణానికి భూమి కేటాయింపు



నవతెలంగాణ-సిద్దిపేట

తహసీల్దార్ ఆఫీస్ ఎదురుగా ఇందిరమ్మ మోడల్ ఇల్లుకు భూమి కేటాయించిన తహసీల్దార్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ చిన్నకోడూరు మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఐకేపీ ఆఫీస్ ఆవరణ వెనుక భాగంలో ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణానికి భూమిని కేటాయించగా, అది ప్రజలకు కనపడదని తను ఎంపీడీవో, తహసీల్దారుకు వినతి పత్రం అందించానని, నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరాం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు ఉడుత జయంత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మసాక్షిగా పనిచేస్తాం



-ఆత్మ కమిటీ చైర్మెన్ మల్లారెడ్డి
నవతెలంగాణ-గజ్వేల్

రైతు సంక్షేమానికి సలహాలకు ఆత్మసాక్షిగా పనిచేస్తామని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) బ్లాక్ స్థాయి రైతు సలహా కమిటీ చైర్మెన్ మద్దూరి మల్లారెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ పాలకవర్గ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తనతోపాటు పాలకవర్గం నమ్మకంతో పని చేస్తామన్నారు. అధికారుల ద్వారా రైతులకు అనేక సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీసభ్యులుగా శాంతం స్వామి, యాదగిరి, సింగిరెడ్డి ప్రణయ, జగ్గరి లతా, మద్దూరి బాలరెడ్డి, రామచంద్ర రెడ్డి, పాశం సుదర్శన్ రెడ్డి దాకిరెడ్డి బుచ్చి రెడ్డి , పుల్ల మంజుల, తదితరలు నియమితులయ్యారు. కార్యక్రమంలో బండారు శ్రీకాంతా రావు హాజరయ్యారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎంఏఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో పనులు సరే..సౌకర్యాలు ఏవి..?



- ఉపాధి కూలీలకు తప్పని తిప్పలు
- సౌకర్యాల పర్యవేక్షణ కరువు

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పేదలకు అందిస్తున్న ఉపాధి హామీ పథకంలో అధికారులు పనులను గుర్తించి పనులు చేపడుతున్నారు తప్ప కూలీలకు మాత్రం సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో ఉపాధి హామీ కూలీలకు తిప్పలు తప్పడం లేదు. ఉపాధి హామీ పనికి వెళ్ళిన కూలీలు నాలుగు గంటల పాటు నీడ, నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీలకు ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స చేసేందుకు కనీసం మెడికల్ కిట్టు కూడా అందుబాటులో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

పేద ప్రజలకు పని కల్పించాలని లక్ష్యంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలు చేసింది. నేటికి ఉపాధి హామీ పథకంలో పనులు కల్పిస్తున్నారు. వేసవికాలం కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేక సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. హుస్నాబాద్ మండలంలో 17 గ్రామపంచాయతీల్లో 4 వేల 519 జాబ్ కార్డులు ఉన్నాయి. 3 వేల 326 జాబ్ కార్డులు ఆక్టివేట్ లో ఉండగా 5 వేల 803 మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు.

పని దగ్గర వసతులు..

గ్రామాల్లో ఉదయం 7 గంటలకు పనులకు వెళ్లిన కూలీలు 11 గంటల వరకు పనులు చేస్తున్నారు. పనిచేసే చోట తాగునీటి వసతి, టెంటు, మెడికల్ కిట్ ఓ ఆర్ ఎస్ తప్పనిసరి ఉండాలి. అవేమీ లేకపోవడంతో కూలీలు చెట్ల కింద కూర్చునే పరిస్థితి నెలకొంది. తాగునీటి వసతి లేక కూలీలు సతమతమవుతున్నారు. కూలీలే స్వయంగా బాటిల్లలో నీళ్ల తెచ్చుకుంటున్నారు. దాహం వేస్తున్న పని చేసే కూలీలకు ప్రమాదాలు జరిగితే పట్టించుకునే వారెవరు. గ్రామాల్లో పనిచేసే చోటకు అడపదడప పరిశీలనకు వెళ్లిన అధికారులు మంచినీటి సౌకర్యం, మెడికల్ కిట్, నీతి వసతి ఏర్పాటు చేస్తామని చెప్పడం తప్ప చేసేది ఏమీ లేదు. కూలీలకు పనుల వద్ద తప్పనిసరి కల్పించాల్సిన సౌకర్యాలు ఎవరు కల్పిస్తారు తెలియని పరిస్థితి నెలకొంది. పనుల వద్ద ఏర్పాట్లను గ్రామపంచాయతీ చూస్తుందా.. ఉపాధి హామీ అధికారులు ఏర్పాటు చేస్తారా అని కూలీలు ఆందోళనలో ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ అధికారులు తక్షణమే ఉపాధి హామీ పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

పనిచేసే చోట అన్ని సౌకర్యాలు కల్పించాలి.



ఉదయం ఏడు గంటలకు వచ్చి 11 గంటలకు వెళ్తున్న. ఎండలు మండిపో తున్నాయి . నీడ ,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు పనిచేసే చోట లేవు.

-ప్రమీల, ఉపాధి హామీ కూలి

సౌకర్యాలు కల్పించని అధికారులపై చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం చేస్తూ సౌకర్యాలు కల్పించని అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఇటీవల అక్కన్నపేట మండలంలో అధికారుల నిర్లక్ష్యం పనులతో కూలీలు చనిపోయారు. పనుల వద్ద నీడ, మెడికల్ కిట్, తాగునీటి వసతులు వెంటనే ఏర్పాటు చేయాలి. కూలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలి

-సీపీఐ(ఎం) నాయకులు శివరాజ్

కూలీలకు సౌకర్యాలు కల్పిస్తాం

గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతాం. ప్రతి గ్రామంలో కూలీలకు నీడ, తాగునీటి వసతి కల్పించాలని గ్రామపంచాయతీ అధికారులకు తెలిపాం. కొన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మిగతా గ్రామాల్లో కూడా అందేలా చూస్తాం.

-హుస్నాబాద్ ఏపీవో పద్మ

ఎల్ఆర్ఎస్ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలి



-జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి
నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

సిద్దిపేట జిల్లాలో లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) పనులను మార్చి నెలాఖరులోపు పూర్తయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. బుధవారం ఐడీఓసీలోని సమావేశమందిరంలో ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లతో ఎల్ఆర్ఎస్ డాక్యుమెంట్ అప్లోడ్, ఆన్ లైన్ డాటా ఎంట్రీ, ఎఫ్‌టీఎల్, ప్రొహిబిటెడ్ ల్యాండ్ తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రొహిబిటెడ్ ల్యాండ్ వివరాలను ఎంపీడీఓలు గ్రామాల వారీగా తహసీల్దార్ల నుంచి తెప్పించుకొని స్పష్టత కలిగి ఉండాలని, ఎల్ఆర్ఎస్‌లో ఫీజు జనరేట్ అయి, కట్టడాని సిద్ధంగా ఉన్న వారి వివరాలను తెలుసుకొని సకాలంలో వారు ఫీజు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మఇళ్ల నిర్మాణాలను గురించి మాట్లాడుతూ.. మీ వద్ద ఉన్న దరఖాస్తులు ఒక సారి పున్ల పరిశీలించుకోవాలని, ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి సకాలంలో నిర్మాణాన్ని పూర్తి చేయడానికి గుత్తేదారు ముందుకు వచ్చిన, గుత్తేదారు మధ్యలో ఆపేసిన పనులు ఆఇంటి యజమాని పూర్తి చేసుకోవడానికి ఆసక్తి చూపిన పూర్తి చేసుకునేలా చూడాలని, అత్యంత పేదరికంలో ఉన్న వారికి జిల్లా లేదా మండల సమాఖ్యలు లేదా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి నిర్మాణాలను పూర్తి చేయించాలని, సూచించారు. బేస్ మెంట్ వరకు పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల వివరాలు వెంటనే అప్లోడ్ చేయాలని, వాటికి చెల్లింపులు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ దేవకిదేవి, డీటీసీపీఓ వందనం, హౌజింగ్ పీడీ దామోదర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి

-సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్

నవతెలంగాణ-నంగునూరు

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. నంగునూరు మండలంలో 20 వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు ప్రధాన పంటలుగా ఉన్నాయని ఎక్కువభాగం బోర్లు వ్యవసాయ బావుల ఆధారంగా పంటలు పండుతాయని పేర్కొన్నారు. వర్షాలు లేక, బోర్లు బావుల కింద రైతులు సాగు చేస్తున్న వరి పొలాలు పొట్ట దశలో, కంకి దశలో ఉన్నాయని ఇప్పటికే మూడు మీటర్ల లోతులో భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల బోర్లు, బావులు ఎండిపోతున్నాయన్నారు. రైతులు ఇప్పటికే ఎకరాకు పాతిక వేలు చొప్పున పెట్టుబడులు పెట్టి పూర్తిగా నష్టపోయారని, కళ్ళముందే నీరు లేక వరిపొలాలు ఎండిపోతుంటే రైతులు ఆవేదన చెందుతున్నారని, గత్యంతరం లేక పశువులను మేపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లు పూర్తిగా అడుగంటిపోయాయని నంగునూరు మండలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడిందని, మూగజీవాలు అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రాజెక్టు ద్వారా చెరువులను కుంటలను నింపాలని, తద్వారా భూగర్భ జలాలు పెరిగి సాగు, త్రాగు నీటి కొరత నుండి అరికట్టి ప్రజలను, రైతుల పంట పొలాలను కాపాడాలని కోరారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలకు సంబంధిత అధికారులు సర్వే నిర్వహించి ఎకరాకు 50 వేల రూపాయల పంట నష్ట పరిహారాన్ని అందించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజ్ కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట



నవతెలంగాణ-సిద్దిపేట

ఈనెల 21 నుంచి 23వరకు చెన్నైలో జరిగిన అలయన్స్ అంతర్జాతీయ సదస్సు, సౌత్ మల్టిపుల్ సదస్సులో సిద్దిపేట జిల్లాకు మొత్తం 11 అవార్డులు వచ్చినట్లు ఇంటర్నేషనల్ కమిటీ చైర్మెన్ ఆత్మ రాములు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బెస్ట్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మెన్‌గా తనకు, బెస్ట్ గవర్నర్‌గా సిహెచ్ బాలచంద్రన్, పస్టు బెస్ట్ గవర్నర్‌గా సేన శివ కుమార్, 2వ బెస్ట్ గవర్నర్‌గా రామచంద్రము, బెస్ట్ సెక్రెటరీగా గంద ఈశ్వర్ చరణ్, బెస్ట్ స్లొగన్స్‌లో బాలచంద్రన్, బ్యానర్ ప్రజెంటేషన్‌లో సోమ వనజ, సైన్స్ క్విజ్ ఆర్గనైజర్ ఆదారి సుజాత, బెస్ట్ ప్రెసిడెంట్ గా జిల్లా రేణుక అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. సౌత్ మట్టిపల్లిలో బెస్ట్ గవర్నర్ స్పెషల్ అవార్డుగా బాలచంద్రము, బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్ సిద్దిపేట జిల్లా సభ్యులు, గవర్నర్ బాలచంద్రము అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బాలచంద్రం, ఈశ్వర్ చరణ్, సోమవనజ, సోమశివకుమార్, పెద్ది రామచంద్రము, గందెసిరి కృష్ణమూర్తి, సుజాత, సుజన, శోభారాణి, వెంకటలక్ష్మి, వెంకట్ లక్ష్మి, భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్నే అందించాలి

-అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్
నవతెలంగాణ-దుబ్బాక

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్నే అందించాలని, నాసిరకం ఆహార పదార్థాలు అందిస్తే చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ హెచ్చరించారు. బుధవారం దుబ్బాక మండలం రామక్కపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని, దుబ్బాక మండల ప్రత్యేక అధికారిని తనుజతో కలిసి ఆమె సందర్శించారు. దీనిలో భాగంగా డైనింగ్ హాల్, వంటశాల, వండిన ఆహార పదార్థాలు, కూరగాయల స్టోర్ రూమ్, డార్మెటరీ గదులను ఆమె పరిశీలించారు. అన్నం మెత్తగా ఉండడంతో వెంటనే ఆ బియ్యాన్ని వెనక్కి తీసుకొని మంచి బియ్యాన్ని పంపించాలని డీఎస్ఓ తనుజకు సూచించారు. ఆహార పదార్థాలు రుచికరంగా లేవని, మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని లేకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. శ్రద్ధగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పేరు నిలబెట్టాలని విద్యార్థినీలకు సూచించారు. అనంతరం అక్కడి డార్మెటరీ గదులను, బాత్రూంలను పరిశీలించారు. రక్తహీనత, చర్మవ్యాధుల బారిన పడ్డ విద్యార్థినిలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయిస్తూ మందులను అందించాలని ప్రిన్సిపాల్ శారద, రామక్కపేట పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ అదీబా లకు సూచించారు. అలాగే రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించనున్న కిచెన్ రూమ్ పనులను



త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. అంతకుముందు దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ఐఓసి కార్యాలయం వద్దనున్న ఓ ప్రైవేటు వెంచర్ ను ఆమె పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎమ్మార్వో ఈ.సంజీవ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి,ఎంపీడీవో వీ.భాస్కర శర్మ,మిషన్ భగీరథ ఏఈ నరేష్,ఆర్ఐ నరేందర్,పంచాయతీ కార్యదర్శులు, పలువురున్నారు.

మొక్కజొన్న పంట క్షేత్ర స్థాయి సందర్శన



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ గ్రామంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను జిల్లా వ్యవసాయ అధికారి రాధిక బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ ఆహార భద్రత మిషన్లో భాగంగా రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు, పీఎస్‌బీ, ట్రైకోడెర్మా విరిడిను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులు యాసంగిలో నీరు ఉంటే పత్తి పంట తీసిన తర్వాత మొక్కజొన్న పండించినట్లయితే పంట మార్పిడి జరిగి చీడపీడల ఉధృతి తగ్గుతుందని, అలాగే ఒక ఎకరం వరి పండించే నీటితో 5 ఎకరాలు మొక్కజొన్న పండించ వచ్చని రైతులకు సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి వసంతరావు మాట్లాడుతూ ఈ ఏసంగి మండలంలోని మొక్కజొన్న 650 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయడం జరిగిందనీ గత సంవత్సరంలో పోలిస్తే మండలంలో మొక్కజొన్న విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఖలీల్ మరియు రైతులు అశోక్, బొక్కి గణేష్, కొత్తపల్లి రాజు, పిట్టల యాదగిరి, కొత్తపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-మర్కుక్: మండలంలోని నర్సన్నపేట గ్రామంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను జిల్లా వ్యవసాయ అధికారి రాధిక బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు, పీఎస్బీ ట్రైకోడెర్మా విరిడిను పంపిణీ చేశారు. రైతులు యాసంగిలో నీరు ఉంటే పత్తి పంట తీసిన తర్వాత మొక్కజొన్న పండించి నట్లయితే పంట మార్పిడి జరిగి చీడపీడల ఉధృతి తగ్గుతుందనన్నారు. ఒక ఎకరం వరి పండించే నీటితో 5 ఎకరాలు మొక్కజొన్న పండించ వచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి వసంతరా వు మాట్లాడుతూ.. మండలంలో యాసంగిలో మొక్కజొన్న 780 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారని, గత సంవత్సరం లో పోలిస్తే మండలంలో మొక్కజొన్న విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తీర్ణ అధికారి విష్ణు , రైతులు సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి, బాలమల్లు , మహేందర్ రెడ్డి , తదితరులున్నారు.

పీర్లపల్లిలో ఉచిత పాశువైద్య శిబిరం



నవతెలంగాణ-జగదేవపూర్

మండలంలోని పీర్లపల్లి గ్రామంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పశువులకు సాధారణ చికిత్సలతో పాటు నట్టలమందు అలాగే ఇంకా ఏదైనా వ్యాధులు రాకుండా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్వేత మాట్లాడుతూ.. 30 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు గర్భకోశ వ్యాధి చికిత్స 25 పశువులకు సాధారణ చికిత్సలు మందులు పంపిణీ 20 పశువులకు గాలి కుంట వ్యాధి 45 తెల్ల పశువులకు ముద్ద చర్మవ్యాధి టీకాలను వెయ్యడం అన్నారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, జగదేవపూర్ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు సముద్రాల హరినాథ్, నరసింహారెడ్డి, నక్క రాములు గౌడ్, పీర్లపల్లి మాజీ ఎంపిటిసి మహేందర్ రెడ్డి మాజీ కొండపోచమ్మ చైర్మెన్ బత్తిని మల్లేశం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-మద్దూరు

చేర్యాల మండలంలోని అర్జున పట్ల కమలాయపల్లి గ్రామాలను పూర్తిగా చేర్యాల మండలంలో విలీనం చేసేందుకు అసెంబ్లీలో చర్చించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, సహకరించిన జనగామ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి, చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండల అధ్యక్షుడు కొమ్ము రవి, ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమలాయపల్లి, అర్జున పట్ల, గ్రామాలు గత 40 సంవత్సరాలుగా మద్దూరు, మండల కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రభుత్వం వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చేర్యాల మండలంలో కలిపేందుకు అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ గ్రామ శాఖ అధ్యక్షుడు సింగపాక కుమార్, చేర్యాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు, మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి నరసింహారెడ్డి, నాయకులు లింగంపల్లి చంద్రశేఖర్, మంతపురి భూమయ్య ,శ్రీశైలం, రామచంద్రం, నర్సింలు, సింగపాక బాబు, తదితరులు పాల్గొన్నారు.

వారసంతల వేలం వాయిదా



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పశువుల, కూరగాయల వార సంతల నిర్వహణకు బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం అవరణం వద్ద ఎంపీడీఓ ప్రవీన్, ఎంపీఓ మంజుల అధ్వర్యంలో వేలం నిర్వహించారు. ప్రభుత్వ నిర్దేశిత వేలం ధర పలకకపోవడంతో మళ్లీ 28న వారసంతల నిర్వహణకు వేలం నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి వెల్లడించారు.

తల్లి ఆరోగ్యంతో ఉంటేనే గర్భస్థ శిశువుకు మేలు



-గర్భిణీలకు అవగాహన కల్పించిన రామకృష్ణ మఠం వైద్యులు
నవతెలంగాణ-గజ్వేల్

తల్లి మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే గర్భస్థ శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతుందని ఆర్య జనని ట్రస్ట్ వైస్ చైర్మెన్ పీడియాట్రిక్ డాక్టర్ అనుపమ రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పుట్టే పిల్లలు సంపూర్ణమైన మానసిక వికాసంతో పాటు శారీరక ఆరోగ్యం పొందడానికి తల్లి ఆరోగ్య మానసిక పరిస్థితులు కారణం అవుతాయన్న అంశంపై రామకృష్ణ మఠం అనుబంధ సంస్థ అయిన ఆర్య జనని ట్రస్ట్,గజ్వేల్ హైందవ సోదరులు, ఆపన్న హస్త మిత్ర బృందం సౌజన్యంతో గర్భిణీలకు బుధవారం గజ్వేల్ లోని కోలాభిరామ్ గార్డెన్ లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమ కేర్ మాట్లాడుతూ.. గర్భంలోని శిశువును తల్లి ఆలోచనలు, చేసే పనులు మాట్లాడే మాటలు మానసిక స్థితి ఇవన్నీ కూడా ప్రభావితం చేస్తాయన్నారు. గర్భంలోని శిశువుకు అనుభవమయ్యే పరిస్థితిలే తర్వాత శిశు వ్యక్తిత్వాన్ని గుణ సంపదను నిర్ణయిస్తాయన్నారు. భవిష్యత్తులో బిడ్డ ఏ స్థాయిలో ఎదగాలనుకుంటుందో తల్లి అయా రంగాలకు సంబంధించిన అంశాలను వినడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సరిత, గజ్వేల్ పట్టణానికి చెందిన గైనకాలజీ వైద్యులు డాక్టర్ నాగ మున్నయ్య, డాక్టర్ శైలజ, డాక్టర్ పద్మాజ్యోతి, డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీలత, సరస్వతి శిశు మందిర్ ప్రధాన ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీ



-ఎంపీఓ మంజుల
నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ మంజుల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31 వరకు రాయితీ అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఎంపీఓ పేర్కొన్నారు.

నీటిని వృథా చేయొద్దు



నవతెలంగాణ-గజ్వేల్

నీటిని వృథా చేయొద్దని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. బుధవారం పట్టణంలో మిషన్ భగీరథ అధికారులతో సమావేశం అనంతరం ప్రభుత్వ పాఠశాలలను ఆయన పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం ఉన్నందున పట్టణ ప్రజలు నీటిని వృథా చేయకుండా అవసరం పూర్తయిన తర్వాత ట్యాప్ ఆఫ్ చేయాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా విషయాన్ని సంబంధిత శాఖ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. గజ్వేల్ మండలం కోమటి బండ గ్రామం వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్ ను సంబంధిత శాఖ అధికారులతో చర్చించి తగు సూచనలు సలహాలు విన్నట్లు చెప్పారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ఈ ఈ, డీఈఈ రాజు, ఏఈఈ శ్రీధర్, మున్సిపల్ ఏఈఈ మహేష్ తదితరులు కలిసి నీటి సమస్యలు వారు దృష్టికి తీసుకుపోయినట్లు చెప్పారు. మున్సిపల్ వాటర్ లైన్ మెన్లు వాళ్ళు పర్యటించి నీటి సమస్యను రాకుంటే చూడాలని సూచించిన చెప్పారు.

సెటిల్‌మెంట్‌ను ప్రజలు సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-సిద్దిపేట

2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ క్రింద ఆస్తి పన్ను బకాయి వడ్డీపై 90 శాతం రాయితీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని ప్రిన్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే 80 శాతం పన్ను వసూలు చేయటం జరిగిందని, ఈ నెల 31 వరకు 100 శాతం పన్నులు వసూలు చేయుటకు పట్టణ ప్రజలు సైతం సహకరిస్తూ, సకాలంలో పురపాలక సిబ్బందికి పన్నులు చెల్లించి, పట్టణ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పట్టణంలోని వాణిజ్య, వ్యాపారస్తులు సైతం ట్రేడ్ లైసెన్స్ రుసుము సకాలంలో చెల్లించాలన్నారు.

మద్దూరు తైబజార్ వేలం



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని తైబజార్‌ను వేలంపాట వేసినట్లు మద్దూరు స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో రామ్మోహన్, బుధవారం విలేకరులకు తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాటా డుతూ. మండల కేంద్రంలోని తైబజార్‌ను ఒక సంవత్సరానికి వేలంపాట ఉదయం 10 గంటలకు వేసినట్లు తెలిపారు. వేలంపాటలో గ్రామానికి చెందిన కొమురవెల్లి కనకయ్య అనే అతను రూ.38,500కు తైబజార్‌ను వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీర రాజు, పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గంట వ్యవధిలో పోన్ అప్పగింత



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన లింగని బాను మొబైల్ బుధవారం అంగడికిష్టాపూర్‌లో సాయత్రం 4 గం॥లకు పోగొట్టుకున్నాడు. వెంటనే మర్కుక్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చాడు. మర్కుక్ పోలీసులు వెంటనే స్పందించి గంట వ్యవధిలో పోన్‌ను కనుగొని బాధితునికి అప్పగించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని కాశ గుడిసెల గ్రామంలో గ్రామ అభివృద్ధి కోసం డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మంజూరు చేయించిన రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షులు కొమ్మురవి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ షేక్ సమీర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ షరీఫ్, మాజీ ఉపసర్పంచ్ చాంద్ బి ,నాయకులు షేక్ హుస్సేన్, సుభాన్, ఇమామ్, దావూద్, షరీఫ్, మహబూబ్, మదర్, హజ్రత్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు దుప్పట్లు, డ్రెస్సుల అందజేత



నవతెలంగాణ-తొగుట

మండల పరిధిలోని ఎలారెడ్డిపేట గ్రామానికి చెందిన కెమ్మసారం భాగ్యలక్ష్మి, నాగ రాజు కొద్ది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం రిటైర్డ్ ఉపాధ్యాయ బృందం, బోరెడ్డి మధుసూదన్ రెడ్డి, హన్మాంతరెడ్డి, రవీందర్ బృందం నలుగురు అనాథ పిల్లలకు రెండేసి జతల డ్రెస్సులు, దుప్పట్లు, బ్లాంకెట్లు, టవల్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లల చదువు ఏర్పాట్ల కోసం, వసతి గృహాలల్లో చేర్పిస్తామన్నారు. ఇంకా మానవత దృక్ప థం కలిగిన వారు ఎవరైనా ఈ నిరుపేద కుటుంబాల పిల్లలకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అందే ప్రవీణ్, దేవరాయ యెల్లం తదితరులు ఉన్నారు.

పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలి



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

అంగన్వాడి కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందేలా చూడాలని పౌష్టిక ఆహార లోపాన్ని అధిగమించాలని సీడీపీఓ శారద అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్‌పల్లి అంగన్వాడి 1, 2 కేంద్రాలను సందర్శించి పిల్లలకు ఆట వస్తువులను పంపిణీ చేసి సమావేశంలో పాల్గొన్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా మండలంలోని ఇప్పటికే ఆయా అంగన్వాడి కేంద్రాలలో అట వస్తువులను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంట్లో కూడా పిల్లలకు, బాలింతలకు, గర్భవతులకు మంచి ఆహారం అందేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సునీత, ఆయా అంగన్వాడీ కేంద్రాల టీచర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాముల పర్తి గ్రామానికి చెందిన నీల సాయిలు అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మర్కుక్ మాజీ ఎంపీపీ పాండు గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పిట్ల మహేష్, మాజీ యూత్ ప్రెసిడెంట్ కరుణాకర్, మ్యాకల శ్రీనివాస్, బాలస్వామి, తదితరులున్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-జగదేవపూర్

మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం సుష్మ బసవ రాజ్ దంపతుల కూతురు చిన్నారి సానిద్య కుక్కల దాడిలో తీవ్రంగా గాయాలపాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. బుధవారం విషయం తెలుసుకున్న జగదేవపూర్ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బుద్ధ నాగరాజు ఆసుపత్రికి వెళ్లి చిన్నారిని చూసి జరిగిన సంఘటన విషయాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం తన వంతుగా ఆర్థిక సాయాన్ని అందించారు. ఇంకా దాతలు ఎవరైనా ఉంటె చిన్నారి కుటుంబానికి అండగా నిలవాలని అన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావులను విమర్శించే అర్హత లేదు

- గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్

కేసీఆర్, హరీశ్‌రావులను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్దాల కాలం పాటు గజ్వేల్‌ను పాలించిన కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యం అని అన్నారు. కేసీఆర్ పదేళ్ళ పాలనలో వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు కావాల్సిన బతుకుదెరువు మార్గాల్ని కూడా కేసీఆర్ కల్పించారన్నారు. పదే పదే మిగిలిపోయిన పనుల గురించి కెసిఆర్, హరీష్ రావు మీద మాట్లాడుతున్న మీరు ఈ పదిహేను నెలల కాలంలో వాటిని ప్రారంభించేందుకు ఎందుకు కృషి చేయడం లేదో చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ కొమురయ్య వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, నాయకులు భాస్కర్, రామస్వామి యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ రోడ్లు అధ్వాన్నం

ఈ రోడ్లపై ప్రయాణం నరకయాతనే

- ఏ గ్రామానికి వెళ్లే రోడ్డు చూసినా గుంతలమయమే
- ఏండ్లు గడుస్తున్నా రోడ్లను పట్టించుకోని పాలకులు
- ఎమ్మెల్యే సునీత రెడ్డి కలగజేసుకొని నిధులు మంజూరు చేయించాలి

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లే రోడ్డును చూసినా ఏముంది గుంతలమయంతో దర్శనం ఇస్తున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అత్యవసర సమయంలో ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే రోడ్లు గుంతలమయంగా ఉండడంతో ఈ రోడ్లపై ఉన్న గుంతల వల్ల ఎక్కువ సమయం ప్రయాణం చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఒక్కో సమయంలో సమయానికి ఆయా పనులకు, ఆసుపత్రులకు చేరలేక ఇబ్బందులు పడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయని ప్రజలు అంటున్నారు. ఈ రోడ్లు సుమారు పది, పదిహేను సంవత్సరాల కింద వేసిన రోడ్లు కాబట్టి అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ రోడ్లను పట్టించుకున్న నాథుడే లేడని అంటున్నారు. ఏ గ్రామానికి వెళ్లే రోడ్డును చూసినా గుంతలమయంతో దర్శనం ఇస్తుంది. పది, పదిహేను సంవత్సరాల కింద వేసిన రోడ్లు తప్ప అప్పటి నుంచి ఈ రోడ్లను పాలకులు గాని, అధికారులు గాని పట్టించుకున్న పాపాన పోలేదని అంటున్నారు. దాదాపుగా ఏ ఒక్క రోడ్డును కూడా ఇప్పటివరకు మరమ్మత్తులు చేయలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని తమ వాహనాలు త్వరగా చెడిపోతున్నాయని అంటున్నారు. వర్షాలు పడిన సమయంలో గుంతల్లో నీరు నిండి, రాత్రి వేళలో గుంతలు కనపడక ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. పాలకులు మారినా వారి స్వార్థ ప్రయోజనాలు చూసుకుంటున్నారు తప్ప ప్రజలు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను పట్టించుకోవడంలేదని అంటున్నారు.

కొండాపూర్-నత్నాయపల్లి రోడ్డు

ఇందుకు నిదర్శనం నర్సాపూర్ మండల పరిధిలోని కొండాపూర్ నుంచి హత్నూర మండలం షేర్ ఖాన్ పల్లి వరకు వెళ్లే రోడ్డు. ఎక్కడ పడితే అక్కడ గుంతలమయంగా ఉండడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు హైదరాబాద్ ప్రధాన రోడ్డు నుంచి కొండాపూర్, కాగజ్ మద్దూర్, నత్నేయపల్లి, పలుగు మీది పోచమ్మ తల్లి దేవాలయం గ్రామాల మీదుగా వెళుతుంది. అంతేగాక ఈ రోడ్డు ద్వారా వెళితే దగ్గరవుతుందనే ఉద్దేశంతో జిన్నారం పటాన్‌చెరు తదితర గ్రామాలకు నిత్యం అనేకమంది ప్రయాణం చేస్తూ ఉంటారు. అయితే ఈ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

బీటీ రోడ్ల మరమ్మత్తుల నిధుల కోసం ప్రతిపాదనలు పంపలేదు

పంచాయతీరాజ్ డిఈ రాధిక లక్ష్మి నర్సాపూర్ మండలంలో ఉన్న బీటీ రోడ్ల మరమ్మతుల కోసం కొత్తగా నిధుల కోసం ప్రతిపాదనలు ఏమి పంపలేదు. ప్రభుత్వం కొత్త స్కీం కింద నిధులు మంజూరు చేస్తుందని తెలిసింది. రుస్తుంపేట్, నాగులపల్లి రోడ్డు మరమ్మత్తుల కోసం రూ. ఐదు కోట్ల 80 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో టెండర్ పిలిచి పనులు చేపడతాము.

రుస్తుంపేట్-నాగులపల్లి రోడ్డు

అదేవిధంగా రుస్తుంపేట్, నాగులపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు సైతం గుంతలమయంగా ఉంది. ఈ రోడ్డు సంగారెడ్డి, తూప్రాన్ ప్రధాన రోడ్డు నుంచి రుస్తుంపేట్, మూసాపేట్, నాగులపల్లి గ్రామాలతో పాటు ఇతర గ్రామాలకు వివిధ తండాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రయాణం ఇబ్బందికరంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అంతేకాకుండా మండలంలోని ఏ గ్రామానికి వెళ్లే రోడ్డును చూసినా గుంతల మయంగా దర్శనం ఇస్తున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి రోడ్ల విషయమై అసెంబ్లీలో ప్రస్తావించి రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించి తమ ప్రయాణ ఇబ్బందులు తొలగించే విధంగా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీలో 51 కి.మీ సీసీ రోడ్లు అవసరం

నవతెలంగాణ-గజ్వేల్

- రోడ్లు పూర్తయితే ట్రాఫిక్ కష్టాలకు చెక్కు
- నిధులు కేటాయించని ప్రభుత్వాలు





గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులు ఉండగా సుమారు 65 వేల జనాభా నివసిస్తున్నారు. మున్సిపాలిటీ 127 కిలోమీటర్ల ఉండగా ఇందు లో మట్టి రోడ్లు 51 కిలోమీటర్లు ఉన్నది. అయితే దీని పరిధిలోనే అనేక కొత్త కాలనీలు నిర్మించారు. కొత్త కాలనీలోనే అనేక రోడ్లు గుంత లుగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నిధుల కేటాయింపు సరిగ్గా జరగలేదు. అండర్ డ్రైనేజీ మూలంగా సీసీ రోడ్లు పూర్తి కాలేకపోయాయి.

రోడ్లకు నిధులు కావాలి: కమిషనర్ నరసయ్య

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మిగిలిన మట్టి రోడ్లకు నిధులు అవసరం ఉన్నాయి. నిధులు రాగానే పనులు చేపట్టవచ్చు. నిధులు లేక పనులు కావడం లేదు. ప్రభుత్వం దృష్టికి తీసుకపోతాం.

మున్సిపాలిటీ చుట్టూ ఉన్న 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డు చివరి దశలో ఒక కిలోమీటర్ మిగిలి ఉండటంతో భారీ వాహనాలు గజ్వేల్, ప్రజ్ఞాపూర్ తూప్రాన్, జగదేపూర్ ప్రధానం రోడ్డు గుండా వెళ్లడం వల్ల ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మున్సిపాలిటీలో 127 కిలోమీటర్ల రోడ్డు ఉండగా ఇందులో సీసీ రోడ్ 94.75కి.మీ మాత్రమే పూర్తయ్యాయి. బీటీ రోడ్లు 15.20కి.మీ వరకు ఉన్నది. గతంలో గజ్వేల్ పాత రింగ్ రోడ్డు బీటీగా ఉంటే ఇప్పుడు సీసీ రోడ్డుగా మార్చే ప్రయత్నంలో నిధులు లేక నిలిచిపోయింది. ప్రధానంగా లక్ష్మీ ప్రసన్న బాలాజీ ఎంక్లేవ్, పలు వార్డుల్లో కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. ఇక్కడ సీసీ రోడ్లు మురికి కాలువలు ఏర్పాటు చేయలేకపోయారు. మున్సిపాలిటీలో మరో మట్టి.51.20 కిలోమీటర్ల రోడ్లు ఉన్నది. దీని పూర్తి చేయవలసిన అవసరం ఉంది.

అసంపూర్తి పనులతో అవస్థలు


- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- దుమ్ముతో ప్రజలకు అనారోగ్య సమస్యలు
- రోడ్ల మరమ్మత్తుపై శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గంలో అనేక మండలాల్లో రహదారులు వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులుగా మారాయి. సిద్దిపేట మీదుగా నూతన జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నది. సిద్దిపేట ఎల్లమ్మ గుడి నుంచి ఇల్లంతకుంటకు పోయే నాలుగు లైన్ల నూతన రహదారి పనులు ఆగిపోవడంతో, కాంట్రాక్టర్ అక్కడక్కడ పనులను విడిచిపెట్టడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ కాలనీ, లింగారెడ్డిపల్లి గ్రామాల ప్రజలకు రహదారి పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల, కంకర పోసి విడిచి పెట్టడం వల్ల దుమ్ము లేచి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. రామయంపేట్ నుంచి ఎలుకతుర్తి వరకు వెళ్లే జాతీయ రహదారి పనులు సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డులో పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఈ మధ్యనే ఈ పనులకు నిధులు ప్రకటించినప్పటికీ, ఆ పనులు ఎప్పుడు ప్రారంభమై.. ఎప్పుడు పూర్తి అవుతాయో అన్న ఇబ్బందుల్లో వాహనదారులు ఉన్నారు. ప్రభుత్వం వెంటనే పనులను చేపట్టి, పూర్తిచేయాలని వాహనదారులు కోరుకుంటున్నారు. అదేవిధంగా పట్టణంలోని 43 వార్డులలో అనేక రహదారులు ఇబ్బందులుగా మారాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఉన్న కొన్ని వార్డుల్లో సీసీ రోడ్డును తవి, పైపులైన్లను వేసి పెట్టారు. కానీ అక్కడ మళ్ళీ సీసీ రోడ్డు పోయకపోవడంతో గత ఐదు ఏండ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వార్డుల్లో సీసీ రోడ్డును, తారు రోడ్డును మున్సిపల్ అధికారులు పోశారు. కానీ చాలా వార్డుల్లో పనులు పూర్తికాక పోవడంతో, ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వాన్నంగా మారిన అందే-మిరుదొడ్డి రోడ్డు

- ఏళ్ల తరబడి గుంతలు మయంగా మారిన పట్టించుకునే నాథుడు కరువయ్యారు
- ప్రభుత్వాలు మారిన పాలన మారడం లేదు
- మా రోడ్డు పనులు బాగు చేయించండి సారు



నవతెలంగాణ-మిరుదొడ్డి

మండలం అందే నుంచి మిరుదొడ్డి వైపు వెళుతున్న రోడ్డు పూర్తిగా కంకర మాయంగా మారింది. ఈ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఎన్నిసార్లు అధికారులకు పట్టిం చుకునే నాధుడే కరువయ్యారు. సంవత్సరాల తరబడి ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు మారింది. ప్రతిరోజు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాలన్న రోజు ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. మిరుదొడ్డి నుంచి అందేకు వెళ్లాలంటే అలవాల మీదుగా సుమారుగా 10 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. వాటితో పాటు అందే నుంచి కొండాపూర్ రోడ్డు కూడా అధ్వానంగా మారిపోయింది. అందే గ్రామానికి వెళ్లాలంటే ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా గురవుతున్నారు. మిరుదొడ్డి నుంచి అందే అందే నుండి కొండాపూర్ మరియు అందే నుండి సిద్దిపేటకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిపోయాయి. గ్రామంలోని ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మా ఊరు చుట్టుపక్కల రోడ్లను బాగు చేయించాలని గ్రామస్తులు కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్



నవతెలంగాణ-సిద్దిపేట

ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ సూచించారు. బుధవారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సెట్విన్ ట్రైనింగ్ సెంటర్ సహకారంతో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని, నైపుణ్యాలను పెంపొందించుకొని సాధికారత వైపు అడుగులు వేయాలన్నారు. మహిళలకు రుణాలు, శిక్షణ కార్యక్రమాలు, స్వయం ఉపాధిని పెంపొందించుకునే విధంగా వనరులు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని అవగాహన కల్పించారు. సెట్విన్ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ద్వారా వివిధ రకాల కోర్సులను కంప్యూటర్, బ్యూటీషియన్, మగ్గం, మెహందీ, ఐటిఐ వాటిని మహిళలకు అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. సెట్విన్ డిస్టిక్ కో ఆర్డినేటర్ అమీనా, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డిలు మాట్లాడుతూ.. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలకు అందుబాటులో ఉన్న సర్వీసెస్ గురించి వివరించారు. శిక్షణలను పొందిన వారికి సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ వాసవి, జెండర్ స్పెషలిస్ట్ లావణ్య, సెట్విన్ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ టీచింగ్ స్టాఫ్, మహిళలు పాల్గొన్నారు.

శ్రీ సాయి ఐటీఐ కాలేజ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు చెప్యాల సంతోష్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని శ్రీ సాయి ఐటీఐ కాలేజీలో విద్యార్థుల తల్లిదండ్రులని వెంటనే రికార్డులు కొనుగోలు చేయాలని, లేనియెడల ఇంటర్నల్ మార్కులు వెయ్యకుండా ఫెయిల్ చేస్తామని విద్యార్థులను బెదిరింపులకు పాల్పడుతున్న కళాశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు చెప్యాలా సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం అయన మాట్లాడుతూ.. అక్రమంగా రికార్డులను రూ.3500 ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. ఐటిఐ ప్రాక్టీస్ చేయాలని పేరుతో మైనర్ విద్యార్థులను షాపులలో పని చేపిస్తున్నారన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండే దాకా విద్యార్థులు చదువుకోవాలని, వేరే పనులు చేయకూడదని ఉంటుందని, కానీ ఐటీఐ కాలేజీలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులని పనిలోకి తోలుతున్న పరిస్థితి ఉందని, వెంటనే ఈ చర్యపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇస్తే అటెండెన్స్ వేస్తామన్న ఘటనపై విద్యాశాఖ అధికారులు స్పందించాలని కోరారు. లేని పక్షాన భారత విద్యార్థి ఫెడరేషన్ సిద్దిపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సాయి ఐటీఐ కాలేజ్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

- ప్రతిభ చాటిన విశ్వశాంతి విద్యానికేతన్ విద్యార్థులు



నవతెలంగాణ-వర్గల్

వర్గల్ మండలం నెంటూరు విద్యార్థులు చక్కటి ప్రతిభ చాటి జవహర్ నవోదయ విద్యాలయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. నెంటూర్ గ్రామానికి చెందిన యెలగందుల శ్రీనిత, ర్యాకల స్నికిత స్థానిక విశ్వశాంతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ వారు నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశానికి అర్హత పరీక్ష వ్రాశారు. కాగా జవహర్ నవోదయ విద్యాలయ సమితి (ఢిల్లీ) పరీక్ష ఫలితాలు ప్రకటించగా, అందులో యెలగందుల శ్రీనిత, ర్యాకల స్నికిత ఉత్తీర్ణత సాధించి సీట్లు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ దేవి దయాకర్, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే ఉపాధ్యాయ బృందానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐకేపీ వీవోఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- వీవోఏల అక్రమ అరెస్టులను ఖండించండి
- సీఐటీయూ నాయకులు
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్


వీవోఏల సమస్యలను పరిష్కరించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ అన్నారు. అక్రమ అరెస్టులు ఖండిస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీ ప్రకారం రూ.20వేల వేతనం ఇవ్వాలని, బకాయి వున్న స్త్రీనిధి ఇన్సెంటివ్ వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలని, గ్రామ సంఘాల నుంచి వీవోఏలకు రావల్సిన రూ.3వేల వేతనం సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామ సంఘాల్లో వీవోఏలపై ఒత్తిడి తగ్గించి వారికి అవసరమైన పరికరాలను అందించాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న తక్కువ వేతనంతో కుటుంబాలు గడవలేని పరిస్థితి నెలకొందని దీంతో వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కనీస బీమా సౌకర్యం లేక వీఓఏల రోడ్డున పడుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నామన్నారు. లేని పక్షంలో సీఐటీయు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి తలపాక కిష్టయ్య, జిల్లా నాయకులు శంకర్, దొమ్మట యాదయ్య, రాజు, మహేష్, చంద్రకళ, వినోద, లక్ష్మి, జ్యోతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కోసం మహిళల ఆందోళన

నవతెలంగాణ-కోహెడ:

మండలంలోని సముద్రాల గ్రామంలో గత వారం రోజులుగా మంచినీటి సరఫరా కావడంలేదని బుధవారం మహిళలు హుస్నాబాద్ నుండి వరంగల్ వెళ్ళే హైవేపై ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా పైప్‌లైన్ తెగిపోయి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని గ్రామ ప్రత్యేక అధికారి, కార్యదర్శికి పలుమార్లు తెలిపామన్నారు. అలాగే ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని టోల్‌ఫ్రీ నంబర్ అధికారులు బోర్డు ఏర్పాటు చేసినప్పటికి దానికి పలుమార్లు ఫోన్ చేసిన ఎలాంటి స్పందన లేదని అసహనం వ్యక్తం చేశారు.

వేసవికాలం కావడంతో పాటు నీరు అందకపో వడంతో ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు అరగంట పాటు నిరసన తెలపడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని మంచినీటిని సరఫరా చేయాలంటూ రాస్తారోకోను విరమించారు.



విచ్చలవిడిగా ఇసుక రవాణ.. అక్రమ నిల్వాలు



-అధికారుల బలంతోననే ఆరోపణలు
-తోటపల్లిలో అక్రమ ఇసుక నిల్వల స్వాధీనం

నవతెలంగాణ-బెజ్జంకి

గత నాలుగు రోజులుగా మండలంలోని మోయతుమ్మెద వాగు నుంచి విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణాకు అధికారులు తెరలేపారని ఆరోపణలు తలెత్తున్నాయి. ఇసుక అక్రమ రవాణదారులు సైతం మాకు అధికారుల అండదండలున్నాయని భాహంటంగానే చెబుతుండడం అధికారుల వ్యవహారణ తీరుపై మటడలంలో చర్చనీయాంశంగా మారింది.

నాలుగు అక్రమ ఇసుక నిల్వల స్వాధీనం

మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారులో ఎలాంటి అనుమతుల్లేకుండా అక్రమంగా నిల్వ చేసిన నాలుగు ఇసుక నిల్వలను తహసీల్దార్ ఆదేశానుసారం పోలీసులతో కలిసి స్వాధీనం చేసుకున్నామని బుధవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి అరెస్ట్ దుర్మార్గం



నవతెలంగాణ-బెజ్జంకి

పేదల ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుని నిర్మించిన రామోజీ ఫిలిం సిటీపై ప్రభుత్వం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టకుండా పేద ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, నాయకులను ప్రభుత్వం అరెస్ట్ చేయడం దుర్మార్గమని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ బుధవారం ఖండించారు. సీపీఐ(ఎం) నాయకులను బేషరుతుగా విడుదల చేయాలని సీపీఐ(ఎం)మండల శాఖ పక్షాన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజీవ్ యువవికాసంపై సీఎంకు లేఖ

నవతెలంగాణ-సిద్ధిపేట

రాజీవ్ యువవికాసంలో సాంకేతిక సమస్యలను, పూర్వం కార్పొరేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను వెబ్ సైట్‌లో ఇంతకుముందే నమోదు చేసుకున్నట్టుగా చూపిస్తూ, కొన్ని యూనిట్లకు ఒక్కో కార్పొరేషన్‌లో వేరువేరుగా యూనిట్ విలువలు ఉన్నందున ఇలాంటి సాంకేతిక లోపాలను లేదా సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ, అడ్వకేట్ బైరి ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ "లా" ఆఫీసుకు యూనిట్ విలువ పెంచాలని, 3లక్షల నుండి 8లక్షలకు పెంచి ఇవ్వాల్సిందిగా కోరారు.

చదువే భవిష్యత్తుకు ప్రధానం

-హెడ్ కానిస్టేబుల్ కనుకయ్య



నవతెలంగాణ-బెజ్జంకి

చదువే భవిష్యత్తుకు ప్రధానమని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకునేల ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెడ్ కానిస్టేబుల్ కనుకయ్య విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో షీ-టీం అధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్లైన్ బెట్టింగ్, విద్యార్థి దశలో క్రమశిక్షణ, సోషల్ మీడియా ప్రభావం, మహిళల రక్షణ చట్టాలు, షీటీమ్ విధులు, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ అపరిచిత వ్యక్తుల ప్రవర్తన అంశాలపై అవగాహన కల్పించారు. షీ-టీం బృందం కిషన్, మహిళా కానిస్టేబుల్ మమత, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-దౌల్తాబాద్

గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, అక్రమ మానవ రవాణా, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటి తలంబ్రాల దీక్షలో మంగోల్ గ్రామస్తులు



నవతెలంగాణ-కొండపాక

భద్రాచల సీతారాముల కల్యాణానికి తెలంగాణ రాష్ట్రం నుండి 250కిలోల గోటి తలంబ్రాలు అందించాలనే సంకల్ప దీక్షతో గ్రామ, గ్రామాన శ్రీకారం చుట్టింది గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థ. అందులో భాగంగా బుధవారం మంగోల్ గ్రామంలో తలంబ్రాలను సేకరించడానికి వస్తున్న సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు ని భక్తులు భాజ భజంత్రిలతో భగవన్నామ స్మరణతో స్వాగతం పలికారు. 300 పైగా భక్తులు పాల్గొని రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఓలిచి సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొడకండ్ల పవన్ కుమార్ శర్మ, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపం





-కొత్త సీసీ రోడ్డు పగుళ్లు

నవతెలంగాణ-రాయపోల్

సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రాణాలు పాటించకుండా నాసిరకంగా ఇష్టానుసారగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని రాంసాగర్ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు ఆదిరెడ్డి అన్నారు. బుధవారం మండలం రాంసాగర్ గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 1వ వార్డులో ఎన్ఆర్ఈ జీఎస్ నిధుల ద్వారా రూ.10 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో ఇసుక వాడకుండా మొత్తం డస్ట్ వాడుతూ నాసిరకంగా నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు నిర్మించిన రెండు రోజులకే పగుళ్ళు ఏర్పడుతున్నాయని, రోడ్డు వేసిన మూడు రోజులకు కూడా క్యూరింగ్ చేయడం లేదని ఆరోపించారు. రోడ్డు కింది భాగం మట్టిని తొలగించకుండా పైనే సీసీ రోడ్డు నిర్మాణం చేయడం ద్వారా రోడ్డు ఎత్తు పెరిగింది. ఇండ్లలోకి వర్షం నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులతో పాటు ఇన్చార్జి మంత్రి కొండ సురేఖకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సురేష్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, కొండారి స్వామి, ఎండి.అన్వర్, రాజు, నర్సింలు, నవీన్, కొండారి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం పంతులు తండా గ్రామ పరిధిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు పగుళ్ల పట్టిందని బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడు రైనా నాయక్ అన్నారు. బుధవారం పగుళ్ల పట్టిన సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో కొత్త రోడ్డు పగిలిపోయిందని తెలియజేశారు. తారాచంద్ తండా నుంచి పంతులు తండా వరకు సీసీ రోడ్డు మంజూరు కాగా కాంట్రాక్టు పొందిన శ్రీనివాస్ నాణ్యత పాటించకుండా నాసిరకంగా వేశారు. రోడ్డు వేసిన వారం రోజులు కాక ముందే రోడ్డు పగుళ్ల పడుతుందన్నారు. రూ: 10 లక్షల ప్రజా ధనం దుర్వినియోగం చేశారని, ఈ రోడ్డును పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించి తగిన విచారణ చేపట్టాలని కోరారు. లేనియెడల బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

గంజాయి మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- గజ్వేల్ సీఐ బి.సైదా



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

విద్యార్థులు గంజాయి మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, సోషల్ మీడియా, సినిమాలకు అట్రాక్ట్ అయి జీవితాలు నాశనం చేసుకోవొద్దని గజ్వేల్ సీఐ బి.సైదా అన్నారు. బుధవారం సురభి దయాకర్ రావు పార్మసీ కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులకు యాంటి డ్రగ్స్, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సీఐ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవిటీజింగ్, గంజాయి, మత్తు పదార్థాలు డ్రగ్ దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాకు సినిమాలకు అట్రాక్ట్ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. షీటీం యొక్క ప్రాముఖ్యత నిర్వహించే విధుల గురించి, సైబర్ నేరాల పై అవగాహన కల్పించామన్నారు. ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాల పరిణామాల పై విద్యార్థులకు వివరించామన్నారు. సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుంచి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల పై విద్యార్థులతో చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ వెంకటరమణ, గజ్వెల్ షీటీమ్ బృందం శ్రీరాములు ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ లావణ్య, కానిస్టేబుల్ మహేష్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు

'కర్ణాల'కు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ- రాయపోల్

రాయపోల్ బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కర్ణాల సత్యనారాయణ గత పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన విషయం తెలుసుకొని బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ బీసీ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు నాయిని రాజగోపాల్, దౌల్తాబాద్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు సర్వుగారి యాదవరెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మెన్ డాకురి చంద్రం, శేకర్ రెడ్డి, కొత్తపల్లి బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బాల్ నర్సయ్య బుధవారం మండలం కొత్తపల్లి గ్రామంలో సత్యనారాయణ పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలు కునేంతవరకు చికిత్స తీసుకోవాలని వైద్యు ల సలహా మేరకు జాగ్రత్తలు పాటించాలి సూచించారు.



గ్రంథాలయ అభివృద్ధిలో ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో అవసరం



నవతెలంగాణ-సిద్ధిపేట

విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల అభివృద్ధికి గ్రంథాలయ ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కెడం లింగమూర్తి అన్నారు. గత కొన్ని ఏండ్లుగా సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ కార్యదర్శిగా అదనపు సేవలు అందజేసిన ఎం.సుదీర్ బదిలీపై వెళ్లడంతో పాటుగా, నూతనంగా గ్రంథాలయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన వసుంధరకు స్వాగతం పలికేందుకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా సుధీర్ సేవలను కొని యాడారు. అనంతరం సుధీర్‌ను ఘనం గా సన్మానించారు. పూర్వ కార్యదర్శి సుదీర్ మాట్లాడుతూ.. గ్రంథాలయ ఉద్యోగుల సహాయ, సహకారాలు మరువలేనివని అన్నారు. ప్రస్తుత కార్యదర్శి వసుంధర మాట్లాడుతూ.. గ్రంథాలయ పాఠకులకు ఉద్యోగులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గంధపాలకులు తిరుపతిరెడ్డి, డి. రాజు, రాజు, కనకలక్ష్మి, ముజఫర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో సోదరభావం పెంపొందుతుంది

నవతెలంగాణ-కోహెడ

ఇఫ్తార్ విందుతో సోదరాభావం పెంపొందుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మస్జీద్ ప్రాంగణంలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ముస్లిం మైనార్టీలు ఉపవాసం ఉంటూ భక్తిశ్రద్ధలతో మసీదులలో ప్రార్థనలు చేసి ప్రజలందరూ సుఖ సంతోషాల తో ఉండాలని అల్లాను వేడుకుంటారన్నారు. అనంతరం ఆయనను ముస్లీం సోదరులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ షరీఫ్, మహమ్మద్ షంషీర్, సయ్యద్ జాంగిర్, చాంద్ పాషా, మహమ్మద్ తుఫాన్, మహమ్మద్ సద్దాం, సయ్యద్ అఖిల్, మహమ్మద్ జాకీర్, వలస సుభాష్ చంద్రబోస్, జాలిగం శంకర్, వేల్పుల శంకర్, మంద మల్లేశం, పిడిశెట్టి రాజు, గోవిందు సురేష్, గోవిందు వెంకటేశం, గవ్వ వంశీధర్‌రెడ్డి, యువసేన మండల అధ్యక్షులు ఎండి ఓవైజ్, గుగ్గిళ్ళ కార్తీక్, రాహుల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందినప్పుడే సామాజిక సమానత్వం

-ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం



నవతెలంగాణ-సిద్ధిపేట

అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందినప్పుడే సామాజిక సమానత్వం లభిస్తుందని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకు విద్య ద్వారానే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచేలా ఉన్నత విద్యలో సమూలమర్పులు రాబోతున్నాయని, వీటిని సామాజికంగా వెనుకబడిన వర్గాలు అందుకున్నప్పుడే ప్రయోజనం ఉంటుందని సూచించారు. ప్రధాన వక్త, కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి మాట్లాడుతూ.. ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ నేపథ్యంలో సామాజిక అంతరాలు మరింతగా పెరుగుతున్నాయని, వాటిని అధిగమించేందుకు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ భక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్న అట్టడుగు వర్గాల సమస్యల మీద చర్చ జరగడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందని, అర్థవంతమైన సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్ళడానికి ప్రయత్నం చేస్తానని వివరించారు. సదస్సుకు వివిధ రాష్ట్రాలనుండి 60 పరిశోధన పత్రాలు వచ్చాయని సదస్సు కన్వీనర్ డా శ్రద్ధనందం తెలిపారు. ఈ కార్యక్రమం లో ధరువువు ఎల్లన్న, డా. కె దివ్య పాల్గొని మాట్లాడారు. సదస్సుకు వచ్చిన అతిథులకు కాళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సులో డా.అనురాధ తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.